# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 37 సంచిక 4

పేజీలు 40

డిసెంబర్ 2017

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ............ 2

శ్రీబాబూజీ ఉవాచ ............ 3

అమ్మమాట ............ 7

వ్యష్టి - సమిష్టి ............ 10

ఒక జెన్ కథ ............ 11

దామోదర లీల ............ 13

త్రిపురా రహస్యం ............ 15

గురువు - విశ్వాసము ............ 18

విష్ణుభక్తి ............ 20

శివుని కథలు ............ 22

షట్కమలములు ............ 24

యోగవాశిష్ఠము ............ 26

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ............ 28

పరిప్రశ్న ............ 29

శ్రీకృష్ణకర్ణామృతము ............ 32

సుందరాకాండ వైశిష్ట్యము ............ 35

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర ............ 37

విష్ణు కథలు- మీరాబాయి ............ 39

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

**యత్పరం బ్రహ్మ సర్వాత్మా విశ్వస్యాయతనం మహత్ ।**
**సూక్ష్మాత్ సూక్ష్మతరం నిత్యం తత్త్వమేవ త్వమేవతత్ ॥**

(కైవల్యోపనిషత్, 16 శ్లో॥)

సర్వవ్యాపి అయిన పరమాత్మ జగత్తులోని సమస్త నామరూపాలలోనూ, ఇంద్రియాలు గ్రహించే ప్రతి విషయంలోనూ, మనస్సులోని ప్రతి భావన లోనూ, బుద్ధిలోని ప్రతి ఆలోచనలోనూ ఆత్మ రూపమై ఉన్నది. తరంగాలు అన్నింటిలోనూ ఉన్నది సముద్ర రూపమే కదా! అంతేకాదు పరమాత్మ విశ్వమునకు ఆధారము. దీనిని ప్రాపంచికంగా భావన చేస్తే అర్థమయ్యే విషయం కాదు. ఆధ్యాత్మికంగా చాలా లోతుగా విచారణ చేయాలి. బంగారం ఆభరణాలకు ఆధారమైనట్లు, సముద్రం తరంగాలకు ఆధారమైనట్లు, కుండకు మట్టిలాగా, బట్టలకు పోగులాగా ఈ విశ్వమునకంతటికీ పరమాత్మ మూలాధారము.

పరమాత్మ వ్యాపకత్వాన్ని తెలియజేయటానికి సూక్ష్మాతి సూక్ష్మతరం అనే పదాన్ని ప్రయోగించడం జరిగింది. సూక్ష్మతను బట్టి దాని వ్యాపకత్వం నిర్ణయించబడుతుంది. ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తే దాన్ని సూక్ష్మము అంటారు. అంతకన్నా ఎక్కువ వ్యాపనశక్తి వుంటే సూక్ష్మతరం అని, అంతకన్నా ఇంకా వ్యాపన కలిగివుంటే దాన్ని సూక్ష్మతమము అని అంటారు. అంటే అంతకన్నా వ్యాపకము కలిగినది లేదన్నమాట. బ్రహ్మ నామరూపాలలో ఆత్మగా మాత్రమే కాక, అన్నింటికి మూలమై వున్నది. సృష్టిలో ప్రతిపదార్థము ఆత్మస్వరూపమే అన్నమాట. స్వప్న ప్రపంచంలో ప్రతిస్వప్నానుభూతికి ఆధారం మనస్సే కదా! అలాగే సర్వవ్యాపకమైన ఆత్మ మరొకదానిచేత పరిమితం కాదు అన్నవిషయం గ్రహించాలి.

సర్వ ప్రపంచము అనిత్యమైనది, మార్పుచెందేదీ అయినప్పటికీ దానికి ఆధారమైన బ్రహ్మ నిత్యమైనది, సత్యమైనది. ఆత్మను గురించి యింత అవగాహన వున్నవాడు దానిని ఒక అంశంగా భావించకుండా సద్గురుమూర్తి ఆ గుర్తించిన జ్ఞానానికి ఆధారమైన ఆత్మను 'తత్ త్వమ్ ఏవ' అని చెప్పటంతో అంతా తేటతెల్లమవుతుంది. దేనిని గుర్తించావో అది నీవే. నీలో ఆత్మవస్తువే అని మాత్రమే కాక అదే సర్వవ్యాపకమైనదని 'తత్ త్వమేవ - త్వమేవ తత్' అని బోధించే ఉపదేశాన్ని శిష్యుడు ఎన్నడూ పెడచెవిని పెట్టడు.

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "సద్గురుమూర్తి శిష్యులకు గురులక్ష్యార్థాన్ని ప్రసాదించేముందు వారియొక్క జన్మసంస్కారము, తత్పరత, లేక ఆవేదన పరిశీలించిన తరువాత అనుగ్రహిస్తారు. శిష్యులు లక్ష్యార్థమును స్వీకరించేముందు తాము బాల్యము నుండి చేసిన దోషాలన్నింటిని మనస్సు దాయకుండా సద్గురుమూర్తికి నివేదించి ఆయన దివ్యచరణారవిందములకు సమర్పించాలి. అటువంటి దోషములను తిరిగి చేయరాదు. గురుదేవుని దగ్గర మనస్సుని దాచకుండా, తాను తెలిసో తెలియకో ఏదైనా చోరత్వముగానీ, తినకూడని పదార్థములు తినడం గానీ, మత్తు పానీయములు సేవించడంగానీ, స్త్రీ పురుషులతో అక్రమసంబంధములు గానీ, గురుదేవునికి నివేదించి, ఆయనకే సమర్పించినట్లైతే వాటిద్వారా సంక్రమించే కర్మ రహితం అవుతుంది.



అలాకాకుండా మనస్సుదాచి ప్రవర్తిస్తే జన్మాంతర కర్మ మిగిలిపోవడమే కాకుండా కల్పాంతము వరకు ఆత్మజ్ఞానమును పొందజాలడు. మీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు మిమ్మల్ని తరింపచేయలేరు. లక్ష్యార్థము స్వీకరించిన శిష్యుడు సద్గురు మూర్తి అభయహస్తమునుండి జన్మించి తన జీవితంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తాడు. ఆయనయందు భక్తి విశ్వాసాలు పెంపొందించుకుని ఆయనను బ్రహ్మవిష్ణు మహేశ్వర స్వరూపంగా దర్శించగలిగితే తప్పక తరించ గలుగుతాడు.

సద్గురుమూర్తిని మానవాకారంలో చూడరాదు. ఆయన మనలాగానే ఉన్నాడు. మనకి మాదిరే భోజనం చేస్తున్నాడు. శరీరబాధకి లోనవుతున్నాడు అని భావించే శిష్యుడికి గురుతత్త్వం అందనంత

దూరంలోనే ఉంటుంది. లక్ష్యార్థము తీసుకున్న శిష్యునికి దేహాభిమానము పనికిరాదు. నిజమైన భక్తుడు లక్ష్యార్థము స్వీకరించి నిర్భయంగా సాధన కొనసాగిస్తాడు. ఎన్నో అనుభూతులను పొందవచ్చు. క్రిందికి పడిపోతున్నట్లుగా, లేక పైకి తేలిపోతున్నట్లుగా, లేక గజ్జెల చప్పుడో, లేక ఘంటానాదమో, లేక నీలికాంతిలో ఎర్రని బింబదర్శనము గానీ, లేక రంగురంగుల చక్రాలుగా, సప్తవర్ణాలుగల ఇంద్రధనుస్సుగానీ, గాలిలో తేలిపోతున్నట్లో, దేహమంతా స్తంభించిపోయినట్లో, శ్వాసవేగం తగ్గినట్లో, కాళ్ళుచేతుల స్పర్శ తగ్గిపోయినట్లో కనిపించవచ్చు. ఇవన్నీ మనస్సు నిలబడేముందు కలిగే అనుభూతులు. నిజమైన సాధకుడు తాను పొందిన అనుభూతులను గురుదేవునకు గానీ, గురుపుత్రునకుగానీ మాత్రమే చెప్పవచ్చును. వీటికి భయపడకుండా సాధన కొనసాగించినట్లైతే ఆ సద్గురు మూర్తియే మీకు రక్షకుడుగా ఉండి మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. లక్ష్యార్థాన్ని స్వీకరించే సాధకులు లక్ష్యార్థాన్ని స్వీకరించేముందున్న ఆవేదన ఆ తరువాతకూడా కొనసాగించాలి.

ఆశ్రమవాసం చేస్తూ సద్గురుమూర్తి బోధాశ్రవణం చేస్తూ, విశ్వాసంతో శ్రవణం చేసిన బోధను మననం చేసుకుని దానిని ఆచరణలో పెట్టినవారికి సద్గురుమూర్తి మోక్షాన్ని ప్రసాదిస్తాడు. కానీ గురులక్ష్యార్థాన్ని స్వీకరించి పటిష్ఠమైన సాధనద్వారా ఆత్మజ్ఞానాన్ని సంపాదించడమే సరైన మార్గము. లక్ష్యార్థాన్ని స్వీకరించిన సాధకులకు కొన్ని నిబంధనలు వుంటాయి. వారు త్రికరణ శుద్ధిగా తను మనోధనాలను సద్గురుమూర్తికి సమర్పించారు కాబట్టి ఈ దేహముగానీ, మనస్సుగానీ మీరు ధర్మమార్గములో ఆర్జించిన ధనముగానీ, దుర్వినియోగము చేయరాదు. సాధకులకు ఎన్నో అవరోధాలు వస్తాయి. ఎంతోమంది ఎన్నోమాటలు అంటారు. మాయాశక్తి విచిత్రమైనది. అది తన ప్రభావాన్ని సాధకునిపై చూపిస్తుంది.

సాధకుడు సాధనలో విజయాన్ని పొందకుండా అడ్డుపడుతుంది. అది ఇతరులలో ప్రవేశించి సాధకులని విమర్శరూపంగా, దూషణరూపంగా అడ్డుకుంటుంది. దానికి లొంగిపోయాడా అది పతనానికి దారితీస్తుంది. మాయాశక్తి కామక్రోధాది గుణాలరూపంలోగాని, సత్త్వరజస్తమోగుణాల రూపంలో గానీ ప్రేరణ చేయవచ్చు. దానిని

అధిగమించగల్గాలి. ఉత్తరకుమారుడి వంటి ఆరంభ శూరత్వం కాకుండా అర్జునుని వంటి సత్యపరాక్రమ స్వరూపుడవు అవ్వాలి. సాధకులు సాధనలో ఎన్నో పరీక్షలను ఎదుర్కొనవలసి వస్తుంది. వాటిని లక్ష్యపెట్టరాదు. నీ గురుదేవులు తండ్రిలాంటివారు. మీ తల్లిదండ్రులను ఎవరైనా విమర్శిస్తే ఊరుకుంటారా! అలాగే మీ గురుదేవుడిని ఎవరైనా విమర్శిస్తే వారికి తగిన సమాధానం చెప్పాలి. లక్ష్యార్థం తీసుకున్న సాధకులు గృహస్థులైతే దాంపత్య జీవితాన్ని గడుపుతూ, దారా పుత్రాదులను ప్రేమించి, వారిచే ప్రేమింపబడేలాగా ప్రవర్తించాలి. మీరు ఏపని చేస్తున్నా గురులక్ష్యార్థాన్ని మరువరాదు. సాధకులు ముఖ్యంగా ఆచరించవల్సింది సన్యాసం, రెండవది బ్రహ్మచర్యం మీరు పరస్త్రీనిగాని, పురుషునిగాని పరమాత్మ స్వరూపునిగా దర్శించాలి. స్త్రీ పురుష అభేదదృష్టి కలిగి నపుంసకుడవై సంచరించడమే నిజమైన సన్యాసము.

సాధకుడు ఆచరించవల్సిన రెండవ నిబంధన బ్రహ్మచర్యం. నీకు ఏరకమైన సంకల్పము కలిగినా దానిని తీర్చుకోవచ్చును. అయినా లక్ష్యార్థాన్ని మరవరాదు. ఈ చర్యవలన మీ మనస్సు విచారణ చేస్తుంది. చివరికి ఆ సంకల్పము తప్పక సాధకునికి దూరమౌతుంది. గురులక్ష్యార్థాన్ని మరవక సాధన కొనసాగించే సాధకుని మనస్సు సంకల్పరహితమై మోక్షస్థితికి చేరువ అవుతుంది. గురుదేవునిపై నీకు ఎటువంటి భావము కలిగినా దానిని వెంటనే ఆయనకు విన్నవించాలి. దానిని రహితం చేసే మార్గము ఆయన సూచిస్తారు. సత్యగురువు లక్ష్యార్థము ప్రసాదించి మీ మనస్సుని దానిపైన లగ్నం చేయమని కోరతారు కానీ సాధకులు సోమరితనంవలన స్నేహితులతో కాలక్షేపం, సినిమాలు, కబుర్లవలన తెల్లవారు ఝామున నిద్రలేవలేక లక్ష్యార్థాన్ని నిర్లక్ష్యం చేస్తారు. సోమరితనం సాధకునికి బద్ధశత్రువు. దానిని జయించాలంటే దానికన్నా శక్తివంతమైన మనోబలం కలిగి వుండాలి. గురులక్ష్యార్థమనే కవచం ఆశక్తిని ప్రసాదిస్తుంది.

కాబట్టి బ్రహ్మముహూర్త కాలంలో నిద్రలేచి చక్కగా ధ్యానం చేసుకోవాలి. అలాచేస్తే గురుకృప వర్షించి, మీలోని సోమరితనం, ఇతర దుర్వ్యసనాలు మీకు దూరమవుతాయి. సోమరితనానికి, కామక్రోధాది గుణాలకు దాసుడై, గురుపాదం పట్టి ప్రతిజ్ఞచేసి స్వీకరించిన లక్ష్యార్థాన్ని నిర్లక్ష్యం చేసిన సాధకుడు ఉద్యోగరీత్యా తాను పెట్టిన సెలవు అయిపోయి

వెళ్ళిపోదామని నిర్ణయించుకున్న తరువాత వెళ్ళిపోక అతి వినయంతో నా అనుమతి కోరటం ఎందుకు? మీరే చెప్పండి? నా అనుమతి కోసం వచ్చినపుడు నేనుండమంటే ఉంటారా? ఈ శరీరాన్ని అమ్ముకున్న తర్వాత మీ ఉద్యోగ ధర్మం తప్పదు కదా? అన్నారు. కొంతమంది సాధకులు ఇంకా అతి వినయం ప్రదర్శించి మీరు ఎలా చెబితే అలా చేస్తామండి అంటారు. వారికి ఎలాగూ సంతానం లేదు కాబట్టి వారి తదనంతరం వారి ఆస్తినంతటినీ ఏదైనా దైవసంబంధమైన సంస్థకి ఇమ్మంటే ఇస్తారా? అంతెందుకండీ మరికొంతమంది ఉంటారు. వారి మాటలు ఇంకా విచిత్రంగా ఉంటాయి. మీరు ఏమి ఆజ్ఞాపిస్తే దానిని అక్షరాలా శిరసావహిస్తామండి! అంటారు. అటువంటివారి అభ్యర్థనని దృష్టిలో పెట్టుకుని వారి ఆరోగ్యం నిమిత్తం ఒక సంవత్సరకాలం ఆశ్రమంలో ఉండి తీర్థప్రసాదాలు తీసుకోండి అని సలహా ఇస్తే భార్యాపిల్లలను వదిలేసి వుండమంటున్నారు అదెలా సాధ్యం? అని ప్రశ్నించేవారికి ఏమి చెప్పగలను?

శిష్యుడు భావించిన విధంగా అనుకూలంగా సలహా ఇస్తే మంచివాడు అంటారు. అటువంటి సాధకులకు గురుతత్త్వము ఎన్నటికీ బోధపడదు. గురు లక్ష్యార్థము స్వీకరించిన గురుపుత్రులకు కులమత భదములుగానీ, వర్ణభేదములు గానీ, పెద్దచిన్న తారతమ్యములు గానీ ఉండరాదు. మానవజన్మ ఎత్తి గురులక్ష్యార్థమును స్వీకరించిన సాధకులు ఎంతో అదృష్టవంతులు. దేవతలకు సైతం లభ్యంగాని వస్తువును పొందిన మానవ జీవితం ఎంతో ధన్యమైంది. ఈ సదవకాశం కోసం దేవతలు ఎదురుచూస్తూ ఉంటారు.

గురులక్ష్యార్థాన్ని స్వీకరించేది సద్గురుమూర్తిని సంతృప్తి పరచడానికి కాదుకదా! పోనీ నీ భార్యా పిల్లల్ని ఉద్ధరించడానికా? లేక నీ కుటుంబ పోషణ నిమిత్తమా? అది కేవలం నీ జీవిత పరమార్థమేమిటో తెలుసుకోవటానికి అని గుర్తించాలి. పోనీ నీ సాధన సఫలీకృతమైతే సంతోషించేది, ఆనందించేది ఎవరు? నీ బంధువులా? నీ మిత్రులా! నీ శ్రేయోభిలాషులా! నీ దారా పుత్రాదులా! వారెవ్వరూ కాదు, సాధకులు ఆత్మజ్ఞాన సంపన్నులైతే ఆనందించి ఆలింగనం చేసుకుని ఆనందభాష్పాలతో అభిషేకించేది మీరు ఆశ్రయించిన సద్గురుమూర్తి మాత్రమే సుమా!" అన్నారు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## ఏకత్వాన్ని గుర్తించడమే ఆరాధన

**ధ్యాన మూలం గురోర్మూర్తిః । పూజా మూలం గురోః పదమ్ ।**
**మంత్ర మూలం గురోః వాక్యమ్ । ముక్తి మూలం గురోః కృపా॥**

మనం ఎంతో ఆనందదాయకంగా దీపావళి, కార్తీక గురుపూర్ణిమ, సరే శ్రీ గురుదేవుల పుణ్యారాధన పూర్తి చేసుకున్నాము. కార్తీక మాసమే చాలా విశిష్ఠమైన మాసం. ఆశ్వయుజం సరేసరి. ఏ మాసం విశిష్ఠం కాదు? భగవన్నామ స్మరణతో గడిపే ప్రతి రోజూ విశేషమయినదే. శ్రీగురుదేవులు ఎప్పుడూ అమావాస్య చాలా మంచిది అనేవారు. చీకటి అనేది వుండబట్టే కదా, వెలుగు యొుక్క గొప్పతనం మనం గుర్తిస్తున్నాం! కాంతికి ఆధారం నువ్వే. నీలో కాంతి వుండబట్టే నువ్వు చీకటిని గుర్తిస్తున్నావు.



అనేకానికి ఏకమే ఆధారం. అది నిర్వికారం, నిరంజనం, నిష్కళంకం. దానికి రూపం లేదు. అనేకానికి రూపం ఉంది. ఈ ఏకత్వాన్ని గుర్తించడమే, అంటే తనను తాను గుర్తించడమే ఆత్మానుభూతి. నువ్వు అద్వైతానుభూతిలో వున్నా, నీ మనస్సు వచ్చి నిన్ను భ్రమింప జేస్తోంది. ద్వైత బుద్ధిని నీ మనస్సే నీకు సంక్రమింపజేస్తోంది. అది నీవు గుర్తించటం లేదు. కాంతికి ఆధారం నువ్వు. తనలో వున్న ఆత్మజ్యోతిని గుర్తించడమే నిజమైన దీపావళి. మనం కార్తీకమాసంలో పెట్టే ఆకాశ దీపాన్ని చూసి నమస్కారం చేసుకుంటాం. అది యదార్థానికి మన హృదయాకాశంలో వెలుగుతున్న ఆత్మజ్యోతిని మనం గుర్తించాలని సంకేతమేమో.

మరో విశేషమేమిటంటే కార్తీక పూర్ణిమనాడు మహానుభావుడైన గురునానక్ జయంతి. ఎందరెందరో మహాత్ములు వస్తున్నారు. ఎందరెందరినో ఉద్ధరిస్తున్నారు. మనలోనే నిలిచిపోతున్నారు. తిరిగి వారి అవతారాలను ఉపసంహరించుకుంటున్నారు. వారి బోధలను మనం శిరసావహించి, మనకి భిన్నమైనవన్నీ విడిచి పెట్టాలి. కానీ మనకి

అభిన్నమైనది ఎవరు అని గుర్తించాలి. మనకి అభిన్నమైనది **'మన హృదయ బాబు.'** **సర్వస్య చాహం హృదిసన్నివిష్టః** అని **'హృద్దేశే తిష్ఠతి'** అని పదేపదే భగవానుడు నొక్కి వక్కాణించాడు. శుద్ధమైన అంతఃకరణ కలిగివుంటే, మన హృదయంలో ప్రకాశిస్తున్న ఆ పరమాత్మని గుర్తించగలుగుతాం. కనుక మలిన భావాలను మన హృదయంలోకి రాకుండా పారద్రోలాలి. దైవత్వం ఒక్కటే 'నాది' అనుకునేది. అదొక్కటే మనకి మిగులుతుంది. నీలోని పరమాత్మ తొలగిపోతే నువ్వే లేవు. అట్టి పరమాత్మ జ్ఞానాన్ని ప్రసాదించేది గురుపరమాత్మ. అందుకే **'న గురోరధికం, న గురోరధికం'** అని గురుగీత ఘోషిస్తోంది. ఏదీ గురువుకంటె భిన్నంగా లేదు. ప్రతి అణువులోనూ ఆయనే వున్నారు. అది ఎలాగ అని మీరు ప్రశ్నించవచ్చు. నీ దృష్టి పడితేనే నీకు ఏదయినా కనిపిస్తోంది. తెలియనంతవరకు నీకు ఆ వస్తువు వుపయోగపడలేదు. కానీ తెలిసినతరువాత నీ దొడ్లో వున్న వేపచెట్టే నీకు వుపయోగపడుతున్నది. కనుక నీకు గుర్తింపులో వున్నది.

తినమని నీకు యిచ్చినదీ భగవంతుడే. కానీ, అతిగా తింటే నీకు జబ్బు అని హెచ్చరించినదీ ఆయనే. నీ యింట్లో నువ్వు పాలరాళ్లతో ఫ్లోరింగ్ వేసుకోవచ్చు, కానీ అజాగ్రత్తగా నడిస్తే నువ్వు జారిపడవచ్చు. నీ నడుము విరగవచ్చు. ఇది ఎందుకు చెపుతున్నామంటే సాధకుడైనవాడు నడిచే నడకలో, తినే తిండిలో ఎంతో జాగ్రత్త వహించాలి. అలాగని భయపడకూడదు, అది పిరికితనం అనిపించుకుంటుంది. నిరంతరం భగవన్నామ స్మరణ చేసుకుంటూ వెళ్ళు. అదే నిన్ను సరయిన మార్గంలో నడిపిస్తుంది. మనస్సు కామంతో నిండిపోకుండా జాగ్రత్త వహించి, విచారణతో దానిని ఖండించాలి. భగవన్నామంతో కూడిన విచారణ చేయాలి. అది నీలోని కామాన్ని ఖండిస్తుంది. నీలో యిటువంటి విచారణ రావాలి అంటే, నువ్వు చక్కగా, తెలిసి శ్రవణం చేయాలి. శ్రవణం చేసిన దానిని మననం చేయాలి. అదే విచారణ అంటే. అది ఏదో ఒక టైమ్‌లో నీకు ఉపయోగపడి తీరుతుంది. బోధని విచారణ ద్వారా మనం అనుభవించగలం. ఇట్టి గురుతులను తెలిపేది శ్రీగురుదేవులు. కామ క్రోధాదులను రహితం చేసేది కార్తీక గురుపూర్ణిమ. ఈ సత్సంగం అనే విందులో ఎవరి హృదయం ఎంత గ్రోల గలుగుతుందో అదే మృష్టాన్న భోజనం. కానీ నువ్వు సరిగా వినాలి. అదే అనుభవం అంటే.

సృష్టిని మార్చలేం కానీ, సర్వం నీ దృష్టిలోనే వుంది కనుక, నీ దృష్టిని మార్చుకో. అప్పుడు నీ అనుభవంలో మార్పు వస్తుంది. 'గురు

పూర్ణిమ' అంటే శ్రీగురుదేవులు చాలా గంభీరంగా వుండేవారు. అదే 'ఆరాధన' అనేసరికి చాలా ఆనందంగా వుండేవారు. ఎందుకని? 'ఆరాధన' అంటే - ఉన్న ఏకత్వాన్ని అందరికీ బోధించే సమయం వచ్చిందనేమో - అనేకత్వం అనేది లేనేలేదు అనేమో.... స్వామివారు ఆరాధన అనేసరికి ఆనందడోలికల్లో ఓలలాడేవారు.

**'సాధూనాం దర్శనం పుణ్యం। స్పర్శనం పాపనాశనం।**
**సంభాషణం కోటి తీర్థ పుణ్యం। వందనం మోక్షదాయకం॥'**

ఈ నాలుగూ పుష్కలంగా లభిస్తున్న మన భాగ్యమే భాగ్యం!!

## సమర్థ సద్గురు (తెలుగు) మ్యాగజైన్

మేము చేసిన అభ్యర్థనను మన్నించి చాలామంది పాఠకులు తమ సభ్యత్వాన్ని జీవిత చందాగా మార్చుకొన్నందుకు కృతజ్ఞతాభివందనములు.

ఉదారస్వభావులైన పాఠకులు రూ.11116/- కట్టి మహారాజ పోషకులుగా, రూ.5116/-కట్టి రాజపోషకులుగా మారారు. వారికి పేరు పేరునా మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

ఇంకా చాలామంది లైఫ్ మెంబర్లు రూ.1116/- కట్టి రెన్యూ చేసికోలేదు. 2800 మంది లైఫ్ మెంబర్లలో షుమారు 200 మంది మాత్రమే ముందుకు వచ్చారు. అలాగే యాన్యుల్ మెంబర్లలో కొంతమంది మాత్రమే ముందుకు వచ్చారు.

ఈ మ్యాగజైన్ మనందరిదీ కాబట్టి అందరూ ముందుకు వచ్చి మహారాజపోషకులుగా/ రాజపోషకులుగా/జీవిత చందాదారులుగా/ చేరి సమర్థ సద్గురు మాస పత్రిక ఇంకా ఎన్నో నూతన ఆధ్యాత్మిక విషయాలతో మీకు అందించేందుకు చేయూత నివ్వండి. మీరు రెన్యూ చేసే చందా **Y.S.C.K.P.M.C.TRUST - SAMARDHA SADGURU MAGAZINE A/C** పేరుమీద **MO/DD/Cheque** గాని తీసి పంపించ ప్రార్థన

సమర్థ సద్గురు యాజమాన్యం

# వ్యష్టి - సమిష్టి

- పాలూరి కాళీప్రసాద్

మనం ఎప్పుడూ 'నేను, నాది, నా యిల్లు, నా కుటుంబం, నా కులం, నా ఊరు, నా జాతి' ఇలా ప్రతి దాంట్లో నాది, పరాయిది అని భావిస్తూ ఉంటాము. దీనినే వ్యష్టి భావన అంటారు. ఈ వ్యష్టి భావనలో వున్నంతకాలం ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ, అలాగే మంచి చెడులు, ఇష్టాయిష్టాలు, రాగద్వేషాలు, ఇలాంటివన్నీ వుంటాయి. అలాకాక, ఈ జగత్తు అంతా ఒక్కటే అనే భావన దృఢమైననాడు ఈ వ్యత్యాసాలన్నీ అంతరించిపోతాయి.

ఒక ఉదాహరణ చూద్దాం. మీరు ఎవరైనా పెద్దల దగ్గరకు వెళ్ళి, 'అయ్యా! నేను నుదుటున విభూతి ధరించాలి అనుకుంటున్నాను' అన్నారనుకోండి, 'అయ్యో! తప్పకుండా ధరించు నాయనా! అది ఎంతో శుభప్రదం.' అంటారు. అదే మీరు 'అయ్యా! నేను విభూతి నా కాలికి రాసుకోవచ్చా?' అని అడిగారనుకోండి, 'బుద్ధి ఉందా లేదా? పరమ పవిత్రమైన విభూతిని అలా అవమానిస్తావా?' అని తిడతారు. ఎందుకంటే ఇక్కడ ఇంద్రియాల పట్ల వ్యష్టి భావన ఉన్నది కనుక ఒక ఇంద్రియం వున్నతమైనది, మరొకటి నీచమైనది అనే భేదాలు ఉన్నాయి. అదే మీరు 'అయ్యా! నా ఒళ్ళంతా విభూతి పూసుకోవాలనుకుంటున్నాను' అన్నారనుకోండి, 'భేషుగ్గా పూసుకో నాయనా! సాక్షాత్ పరమశివుడిలాగ ప్రకాశిస్తావు' అంటారు. మరి ఈ (ఒళ్ళంతాలో) తల, పాదాలు ఇంకా మధ్యలోని అన్ని అంగాలు మనం పైకి చెప్పుకోవడానికి సిగ్గుపడేవాటితో సహా ఉంటాయి కదా! కానీ, ఇక్కడ సమిష్టి భావన వుండటం చేత, ఆ భేదాలన్నీ అంతరించిపోయి అది తప్పుగా తోచలేదు.

మరో ఉదాహరణ చూద్దాం. మీరు గుడిలోకి వెళ్ళి దేవుడికి శిరస్సుతోనో, చేతులతోనో నమస్కరించారు అనుకోండి చూసిన వాళ్ళందరూ కూడా ఎంతో సంతోషిస్తారు. అదే మీరు పాదాలతో నమస్కరిస్తాం అన్నారనుకోండి విన్నవాళ్ళు మీ పైకి చెప్పులు తీస్తారు. కానీ మరి సాష్టాంగ నమస్కారం చేసేటప్పుడు మనం పాదాలతో కూడా భగవంతునికి నమస్కరిస్తున్నాము. ఎందుకంటే 'ఉరసా, శిరసా, దృష్ట్యా, మనసా, వచసా, తథా పద్భ్యాం, కరాభ్యాం, కర్ణాభ్యాం ప్రణామోష్టాంగ ఉచ్యతే' - ఇదే వ్యష్టి భావనకు సమిష్టి భావనకు ఉన్న తేడా.

# ఒక జెన్ కథ

- రమణ ప్రసాద్

టావోయిస్ట్‌లు ఖాళీ బోటును గురించి పేరొందిన బోధ - ఒక ఖాళీ బోటు నీ బోటును నది మధ్యలో ఉండగా గుద్దుతుంది. అది ఖాళీ బోటైంది కాబట్టి నువ్వు ఏమీ అనలేవు. కాని అందులో ఎవరైనా వుండివుంటే వాళ్ళతో పోట్లాటకు దిగివుండేవాడివి.

ఇందులో విషయమేమిటంటే, నిన్ను సరిగ్గా చూడని తల్లి తండ్రులు, నువ్వు పిల్లవాడుగా వున్నప్పుడు నీతో చెట్టాపట్టాలాడిన బాలురు, నీ బోటును గుద్దిన రాష్ డ్రైవరు (Rash driver) `- అన్నీ చుక్కాని లేని నావలే. పరిస్థితుల ప్రభావంవల్ల వారా విధంగా ప్రవర్తించి దెబ్బలు తగిలించుకున్నారు. కాబట్టి వారేంచేస్తున్నారో వారికి తెలియదు. వారు చేస్తున్నదానిపై వారికి నియంత్రణ లేదు.



ఏ విధంగా ఖాళీ బోటు నీ బోటును గుద్దాలని గుద్దలేదో ఆలాగే నీ పట్ల నిర్దయగా ప్రవర్తించినవారు వారికి కలిగిన గాయాల ప్రభావం వల్ల నిన్ను గాయపరచి ఉండవచ్చు.

దానిని తెలుసుకునేంతవరకు మనం ఈ దుఃఖాలలో బందీలుగా ఉంటాం. మన గతం, మనకి తెలియకుండా కష్టాలలో పడటం- ఇవన్నీ మనని తీవ్ర జీవిత ప్రవాహంలో తేలియాడుతూ మనవైపుకు వస్తున్న ప్రేమ వెల్లువను వర్తమానంలో మనను అందుకోకుండా చేస్తాయి.

శుభాభినందనలతో ...


INDIGENEOUS anadig MAKE
CAKT-02, CAKT-05, CAKT-06 & TAK-011-03
ENGINE ROOM INSTRUMENTATION FOR EKM SUBMARINE
INDIGENOUS INSTRUMENTS FITTED ON
• INS SINDHUKESRI
• INS SINDHUGHOSH
• INS SINDHUSHSTRA
• INS SINDHURAJ
• INS SINDHUKIRTI
• INS SINDHUVIR
• INS SINDHUVIJAY
anadig systems
B-214, Shreyas Industrial Estate, Near Jaicoach, Goregaon (E), Mumbai: 400 063.

# దామోదర లీల

- రమణ ప్రసాద్

ఒకనాడు యశోద పెరుగు చిలుకుతూ, తన కుమారుని బాల్య లీలలను పాటలుగా చేసి పాడుకుంటోంది. నారింజ రంగు చీర ధరించి, ఆ చీర కొంగును నడుముకి బిగించి, పెరుగు చిలుకుతుంటే ఆమె పిరుదులు కదులుతున్నాయి. ఆమె ధరించిన గాజులు కదులుతున్నాయి. ఆమె చెవి పోగులు శ్రావ్యమైన శబ్దం చేస్తున్నాయి. కృష్ణునిపై ఉన్న ప్రేమకు ఆమె వక్షోజాలు పాలతో చెమర్చాయి. ఆమె నుదుట చిరు చెమటలు పట్టాయి. ఆమె తలలో పెట్టుకొన్న మాలతి పుష్పాలు క్రిందికి జారి పడ్డాయి.



శ్రీ సనాతన గోస్వామి, 'ఈ సంఘటన దీపావళి రోజున జరిగింది' అంటాడు. యశోద నందుని గోశాలలో ఉన్న గోవులకి ప్రత్యేకమైన పచ్చ గడ్డి పెట్టేది. దానిని తిన్న ఆవులు అత్యంత మధురమైన, సువాసనలను వెదజల్లే పాలను ఇచ్చేవి. యశోద ఆ పాలను తోడుపెట్టి స్వయంగా చిలికి వెన్న చేసేది. ఎందుకంటే పొరుగిళ్లలో కృష్ణుడు వెన్న దొంగిలించటం చూసి తాను చేసిన వెన్న, పొరుగిళ్ళలోని వెన్నకంటే ఎంతో మధురంగా ఉండాలని ఈమె ఈ జాగ్రత్తలు తీసికొనేది.

ఇలా వెన్న చిలుకుతుండగా కృష్ణయ్య వచ్చి పాలు తాగుతానని మారాం చేశాడు. చాలా ఆకలిగొని ఉన్నాడేమో తల్లిని చిలకకుండా కవ్వాన్ని గట్టిగా పట్టుకున్నాడు. తల్లి తను చేస్తున్న పని ఆపి, కొడుకుకి చన్నిచ్చి కృష్ణుని అందమైన ముఖాన్ని చూస్తూ ఉండిపోయింది. ఇంతలో తాను పొయ్యిమీద పాలు కాగపెట్టిన సంగతి గుర్తుకి వచ్చి పిల్లవాడిని క్రిందపెట్టి వంటింట్లోకి పరిగెత్తింది. బుజ్జి కృష్ణయ్యకు కడుపు నిండలేదు. తల్లి హఠాత్తుగా తనని వదిలి వెళ్లటంతో గుడ్ల నీరు కుక్కుకొని, కోపంతో ఒక రాయి తీసికొని దధి భాండాన్ని పగులగొట్టి, పక్క గదికి వెళ్ళి అప్పుడే

చిలికిన వెన్న తీసికొని తింటున్నాడు. యశోద తిరిగి వచ్చి కృష్ణుడు లేకపోవటంచూసి, తాను దండిస్తాననే భయంతో ఇక్కడే ఎక్కడో దాక్కొని వుంటాడులే అని వెదకటం మొదలు పెట్టింది. ఇంతలో ఆమెకి, వెన్న అంటిన కాళ్ళ గుర్తులు కనిపించి అటుగా వెళ్ళింది. బోర్లవేసిన రోలుమీద కూర్చుని కోతులకు వెన్న పెడుతూ ఉండటం చూసింది.

భయం భయంగా అటూ ఇటూ చూస్తున్నాడు తల్లి చేతిలో కర్ర పట్టుకు రావటం చూశాడు. ఎంతో భయాన్ని నటిస్తూ రోలు మీదనుంచి దిగి పరిగెత్తాడు. యశోద వెనక పరిగెడుతోంది. అమె వెళ్తుంటే ఆమె సిగ విడివడి తాను అలంకరించుకొన్న పువ్వులు క్రిందపడుతున్నాయి. యోగులకు కూడా అందని ఆ బాలుని పట్టటానికి ప్రయత్నించి. ఎట్టకేలకు కృష్ణుడిని పట్టుకొంది.

వెంటనే కృష్ణుడు పెద్దగా ఏడుస్తూ కళ్ళు నులువుకుంటున్నాడు. కారుతున్న కన్నీళ్లు కంటికి పెట్టిన కాటుకతో కలిసి ముఖం అంతా కాటుకమయమైంది. “అమ్మా! ఇంకెప్పుడూ దొంగిలించను. నా ఈ తప్పును క్షమించమని కన్నీరు కారుస్తున్న వానిని చూసి కొట్టటానికి చేతులు రాక చేతిలోని కర్ర పారవేసి,‘ఓహో! మీరు శ్రీకృష్ణులా? ఎప్పుడూ వెన్న చూడలేదట కదా! దొంగతనం చేయటం మీకు తెలియదట కదా!’ అంటూ అతనిని రోలుకి కడదామనుకుంది. కృష్ణుడి నడుముకు త్రాడు కడుతుంటే త్రాడు రెండు అంగుళాలు తగ్గింది. ఆ త్రాడుకి ఇంకొక త్రాడు కట్టి నడుముకి కడితే ఇంకా రెండు అంగుళాలు తక్కువైంది. ఎన్ని త్రాళ్లు తెచ్చి కట్టినా కట్టుబడలేదు. ఆమె అలిసిపోయింది. నుదట చెమటలు కారుతున్నాయి. కృష్ణుడికి దయ కలిగింది. తల్లి చేత రోటికి కట్టబడ్డాడు.

చిక్కఁడు సిగి కౌగిటిలో,
జిక్కడు సనకాదియోగి చిత్తాబ్జములం।
జిక్కడు శ్రుతిలతికావళిఁ,
జిక్కెనతఁడు లీలఁదల్లిచేతన్ ఱోలన్॥

రుక్మిణి కౌగిటిలో చిక్కనివాడు, సనకాదిమునుల చిత్తములకు చిక్కనివాడు, శ్రుతులకు అందనివాడు తన తల్లి చేత రోటికి కట్టబడ్డాడు.

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

## జ్ఞాన ఖండం

### 12వ అధ్యాయం

పరశురాముడికి ఇంకా సందేహం తీరక ఇలా అడిగాడు 'మీరు జగత్తు చిద్రూపం అని చెప్పారు. అయినా జగత్తు అన్ని కాలాలలో సత్యమే అని తోస్తోంది. ఈ భ్రమను నివారించండి.'

దత్తాత్రేయుడు: పరశురామా! ఈ జగత్ భ్రాంతికి కారణం అవిద్య. ఆత్మ అంటే తెలియక శరీరమే ఆత్మ అనుకుంటున్నారు. అందువలన శరీరమే ఆత్మ అనే భ్రాంతి కలుగుతోంది. జగత్తు సత్యం అనే భావన కూడా అవిద్య వల్లనే కలుగుతోంది. "జగత్తు అసత్యం" అని దృఢ భావన చేస్తే ఆ భ్రాంతి పోతుంది. పూర్వం జరిగిన మహాద్భుతమైన ఉదంతం చెబుతాను విను,



"వంగదేశంలో 'సుందరము' అనే పట్టణాన్ని సుషేణుడు పాలిస్తున్నాడు. అతనికి మహా సేనుడు అనే తమ్ముడు వున్నాడు. సుషేణుడు శివుని వుద్దేశించి అశ్వమేధ యాగం చేశాడు. అశ్వాన్ని అడ్డగించిన వారినందరినీ జయించారు. ఇరావతీ నదీ తీరాన తంగణుడు అనే తపోనిధిని చూసి బలగర్వంతో అతడిని నిర్లక్ష్యం చేశారు. తండ్రిని అవమానించినందుకు కుమారునికి రోషం వచ్చింది.

తంగణ పుత్రుడు గుఱ్ఱాన్ని పట్టుకున్నాడు. ఆ గుఱ్ఱాన్ని తీసికొని గండ పర్వతంలో ప్రవేశించాడు. రాజ పుత్రులు తమ సేనలతో ఆ పర్వతాన్ని బ్రద్దలు చేశారు. తంగణుని కుమారుడు బయటకు వచ్చి వారందరినీ క్షణకాలంలో జయించి, రాజపుత్రులను బంధించి మళ్లీ గండ పర్వతంలో ప్రవేశించారు. సుషేణుడు ఇది విని తన తమ్మునితో, 'తపస్సంపన్నుల శక్తిని మనం తెలుసుకోలేము. ఆ మహర్షిని ప్రసన్నం చేసికొని, కుమారులను, గుఱ్ఱాలను తీసికొని తొందరగా రా!" అని చెప్పాడు.

అతడు తంగణుడిని చూశాడు. ఆమహర్షిని చూశాడు. ఆ మహర్షి తన మనసును చిద్రూపాత్మతో ఐక్యానుసంధానం చేసికొన్నాడు. కొయ్యలాగా, గోడలాగా నిశ్చలంగా ఉన్నాడు. ఇంద్రియ వ్యాపారాలు లేవు. నిర్వికల్ప సమాధి అనే సముద్రంలో 'నేను' అనే భావం విలీనమైపోయింది. కాని అహం అనే భావం అతి సూక్ష్మంగా లోపల ఉంది. మహాసేనుడు మహర్షికి నమస్కారం చేశాడు.

రాజు తన తండ్రిని స్తోత్రంచేయటం చూసి సంతోషించి, " రాజా! నీకు ఏమి కావాలోచెప్పు. నీ కోరిక తీరుస్తాను. నేను ఆయన పుత్రుడను. ఇప్పుడు ఆయన మాట్లాడరు. పన్నెండు సంవత్సరాల తర్వాత సమాధినుండి మేల్కొంటాడు. ఈ మాట విని, రాజు,"మునీంద్రా! నువ్వు నిజంగా నాకోరిక తీర్చాలనుకుంటే , ఇప్పుడు మీ తండ్రి సమాధినుండి లేచి నాతో మాట్లాడాలి. ఇదే నా ముఖ్యమైన కోరిక."అన్నాడు. మునిపుత్రుడు - నీ కోరిక సాధ్యమయ్యేది కాదు. అయినా ఒక ముహూర్త కాలం వేచి వుండు. ఆయనను నా యోగ శక్తితో మేల్కొల్పుతాను."

"ఇంద్రియాలను నిరోధించి, ప్రాణంతో అపానవాయువును కలిపి, రెంటినీ ఒకటిగా చేసి- అపానవాయువును నిరోధించి, ప్రాణవాయువును పూర్తిగా బయటకు వదలి -రేచకం చేసి - బాహ్యకుంభనం చేసి, ముఖ్యప్రాణంతో, అంటే అహంకార రూపమైన అంతఃకరణంతో శరీరంనుండి బయటకు వచ్చి, తండ్రి శరీరంలో ప్రవేశించి, తండ్రి మనస్సును ఆకర్షించి జాగ్రదావస్థలోకి వచ్చేటట్లు చేశాడు. తరువాత తండ్రి శరీరంలోనుంచి బయటకు వచ్చి, తన శరీరంలో ప్రవేశించాడు.

ఇంతలో తంగణముని బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు. తనకు నమస్కారం చేస్తూ, స్తోత్రం చేస్తున్న రాజును చూశాడు. యోగ దృష్టితో అంతా తెలుసుకున్నాడు.

కొడుకును పిలిచి,"వత్సా! ఇంకెప్పుడూ ఇలా చేయకు. కోపం తపస్సుకు శత్రువు. రాజు లోకాన్ని రక్షిస్తూ ఉంటే తపస్సు నిర్విఘ్నంగా సాగుతుంది. యజ్ఞాలను విఘ్నం చేయటం రాక్షస స్వభావం. మునుల స్వభావం కాదు. మంచి మనస్సుతో గుఱ్ఱాన్ని, రాజపుత్రులను ఇవ్వు. తంగణపుత్రుడు ఒక క్షణంలోగుఱ్ఱాన్ని, రాజ పుత్రులను మహాసేనుడికి ప్రేమతో అందించాడు.

మహా సేనుడు ఆశ్చర్య పడి, "భగవన్! నా సోదరుని పుత్రులని, గుఱ్ఱాన్ని ఉంచటానికి చోటు చాలని రాళ్ళకుప్పపైన ఈ గండశిలలో

ఎలాఉంచ గలిగారు?'

తంగణుడు,"పూర్వం నేనొక రాజును. మహేశ్వరుని అనుగ్రహం వల్ల, సర్వలోకాధీశ్వరి చిద్రూపి అయిన త్రిపురాదేవియే ఆత్మరూపిణి అని ప్రపంచమంతా నీరసమని తెలుసుకున్నాను. లోక వ్యవహారాలపై వైరాగ్యం కలిగి, కొడుకులకు రాజ్యం అప్పగించి అడవులకు వచ్చాను. నా భార్య ఒక కుమారుని కని పంచభూతాలలో కలిసి బ్రహ్మైక్యం పొందింది. నా కుమారుడు నా వద్దనుంచి యోగశక్తులు సంపాదించాడు. ఈ కొండ వెనక ఒక లోకాన్ని సృష్టించి పరిపాలిస్తున్నాడు. అతడే రాజపుత్రులను గుఱ్ఱాన్ని బందీలుగా చేశాడు. అయితే నాకు ఆలోకాన్ని చూడాలని ఉంది" అన్నాడు రాజు.

మునికుమారుడు రాజును తీసికొని గండశైలానికి వెళ్ళి తను అందులో ప్రవేశించాడు. రాజుకు యెగ సిద్ధి లేనందున ఆ పర్వతంలో ప్రవేశించలేకపోయాడు. మునికుమారుడు రాజు శరీరాన్ని ఒక చెట్టు తొర్రలో ఉంచి ఆతనిని మనోమాత్ర శరీరంతో ప్రవేశింపజేశాడు. ఆ లోకంలో అనంతాకాశాన్ని, తెల్లని చంద్ర మండలాన్ని చూశాడు. ఆ లోకం స్వర్గానికి ప్రతిబింబంగా ఉంది. అలాగే ఇతర లోకాలను చూపించి, రాజా! ఈ లోకాలను చూడటంలో 12 అర్బుద సంవత్సరాలు గడిచిపోయాయి. ఇక్కడి కాలమాన ప్రకారం ఇది ఒక రోజు మాత్రమే.

-సశేషం

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా డిసెంబరు 2017, జనవరి 2018, మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి

డిసెంబరు 2017: AS 2990, 2991, 2994, 5388, 5397, 6373, 6602, 6614, 7197,

జనవరి 2018: AS 5440, 5441, 5443, 5445, 5446, 6486, 6624, 6626, 6633,
AS 6812, 6824,6990, 6992, 7160, 7173, 7207, 7210, 7273,
AS7207, 7210, 72737419, 7421-7426, 7432, 7434-7436,
AS 7439, 7440, 7441, LM 4106

– మేనేజర్

# గురువు - విశ్వాసము

- గాలి జగదీశ్

ఒక రోజు ఒక రిక్షావాడు ఎవరో బాబాను రైల్వేస్టేషన్‌లో నుండి బస్టాండ్‌కు తన రిక్షాలో కూర్చోబెట్టుకుని తీసుకువస్తున్నాడు. ఈ రోజుల్లో కొంతమంది సాధువుల వేషంలో, సోమరులై భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అందువల్ల ప్రజలకు అసలు ఎవరో నకిలీ ఎవరో గుర్తించటం కష్టమైపోతోంది. ప్రస్తుత బాబా కూడా అటువంటి రకమే. ఆయన దగ్గర 100 రూపాయల విలువచేసే ఒక రేడియో ఉంది. దాని మీద ఒక సినిమా నటి స్టిక్కర్ అంటించి ఉన్నది.

బస్టాండ్‌కు చేరగానే, ఆ రిక్షావాడు ఆ బాబాను బండి నుండి దిగగానే, 'స్వామీ! మీరు నాకు కిరాయి డబ్బులు ఇవ్వకపోయినా ఫరవా లేదు కాని, ఏదైనా మంత్రమో, తంత్రమో, ఏదైనా పూజనీయ వస్తువు పటము లాంటిది ఇవ్వండి, దాన్ని పూజిస్తే నా పనిలో మంచి లాభం రావాలి. అటువంటిది ప్రసాదించండి నాకు' అని అడిగాడు.

అసలైన వేషధారియైన ఆ బాబా ప్రజలను తన వేషంతో మోసం చేస్తూ బ్రతుకుతున్నాడు. తన దగ్గర తనకు ఎవరో యిచ్చిన రేడియో మీద ఉన్న స్టిక్కర్‌ను తీసి, ఆ రిక్షావాడికిస్తూ, 'ఇది తీసుకెళ్ళి రోజూ పూజ చేసుకో. నీకు శుభం జరుగుతుంది' అని చెప్పాడు.

ఆ రిక్షావాడు నిజంగానే ఆ స్టిక్కర్‌ను తన పూరి గుడిసెలో ఒక మూల ప్రతిష్ఠ చేసుకుని, పూలు జల్లుతూ, మాతాజీ.... మాతాజీ అంటూ భక్తితో జపం చేసి, కడ్డీలు వెలిగించి, హారతి ఇచ్చేవాడు. రోజూ వాడు ఆ ఫొటో ఎదురుగా నిలబడి 'అమ్మా! నాకు బేరం బాగా వచ్చేట్టు చూడు. రాత్రికి నీకు లడ్డూ .... కోవా .... ఇలా నైవేద్యం పెడతాను' అనుకునేవాడు. దైవానుగ్రహంతో వాడికి నిజంగానే గిరాకీ బాగా పెరిగిపోయి, బోలెడు బేరాలు వచ్చి, ఆదాయం పెరిగిపోయింది. వాడు రిక్షా స్థాయి నుండి ఆటో స్థాయికి వచ్చాడు.

అక్కడున్న తోటి రిక్షావాళ్ళంతా ఇది చూసి ఆశ్చర్యపోయి, 'నీకు ఎలా వస్తోంది? మేము గిరాకీలు లేక గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటుంటే నీవు ఎలా ఎదిగిపోయావు?' అని అడిగారు.

దానికి ఆ రిక్షావాడు సమాధానం చెబుతూ 'ఒక రోజు ఒక బాబాగారు నా రిక్షా ఎక్కారు. ఆయన దిగివెళ్ళిపోతూ నాకు ఒక మాతాజీ ఫొటో యిచ్చి, 'దీన్ని పూజించుకో నీకు శుభం జరుగుతుంది' అన్నారు. ఇదంతా ఆయన కృప' అంటాడు. వెంటనే తోటి రిక్షావాళ్ళు 'మాకు కూడా ఆ దేవతను చూపించు' అని అతని వెంటనే వాడి ఇంటికి వస్తారు. రిక్షావాడు తన యింటిలో వున్న ఆ పూజా ఫొటోని చూపిస్తాడు. వచ్చిన వాళ్ళంతా సినిమా పిచ్చి బాగా ఉన్న వాళ్ళు. ఆ ఫొటోని చూస్తూనే వారందరూ ఒక్కసారిగా, వెటకారంగా 'ఈమె దేవత కాదు. సినిమా యాక్టర్ హేమమాలిని' అని గట్టిగా అరుస్తూ పగలబడి నవ్వుతారు.

దానికి ఆ రిక్షావాడు విసుగ్గా 'పొండి, పొండి. ఈమె నా కులదేవత. ఈవిడను పూజిస్తేనే నాకు బేరం బాగా వచ్చింది' అన్నాడు. వారందరూ నవ్వుకుని వెళ్ళిపోయారు.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయం విశ్వాసం. మంత్రమో, తంత్రమో, మూర్తియో ముఖ్యం కాదు. అక్కడ అసలు పనికి రాని వస్తువైనా కూడా, ఆ బాబా మోసంతో చెప్పినా కూడా, ఏమీ తెలియని ఆ రిక్షావాడు గాఢమైన విశ్వాసంతో సేవించాడు. కాబట్టి సర్వమూ తెలిసిన భగవంతుడు వాని పూజకు ఫలితాన్ని ప్రసాదించాడు. విశ్వాసం వుంటే గడ్డిపరక కూడా బ్రహ్మాస్త్రమై ప్రకాశిస్తుంది.

## 06.11.2017 నుండి 13.11.2017 వరకు జరిగిన శ్రీ సద్గురు పుణ్యారాధన నవ వింశతి పుణ్యారాధన మహోత్సవాలలో భక్తులు చేసి బాబు నామ పారాయణ వివరాలు

| | |
|---|---|
| **ఆశ్రమం భక్తులు -** | **1,04,35.000** |
| **కొత్తలంక భక్తులు -** | **1,55,12,000** |
| **(05.10.2017 నుండి 15.11.2017 వరకు)** | |
| **మండల దీక్షలో పాల్గొన్న భక్తులు -** | **1,52,03,000** |
| **మొత్తం ..................................................** | **4,11,50,000** |

**శ్రీ సద్గురుదేవుల, శ్రీ మాతాజీ వారల ఆశీస్సులు వీరందరిపై వర్షించుగాక!**

# విష్ణు భక్తి

సేకరణ - మురళీ

ఒక మహారాజు విష్ణుమందిరానికి వెళ్ళి, విష్ణుమూర్తి దివ్య మంగళ విగ్రహాన్ని విధిపూర్వకంగా పూజించాడు. బంగారు పూలతో, మణులతో, ముత్యాలతో విష్ణుమూర్తిని పూజించి, సాష్టాంగ నమస్కారం చేసి, అక్కడే కూర్చున్నాడు. ఇంతలో ఆ నగరంలోనే వుండే ఒక బీద బ్రాహ్మణుడు పూజకోసం వచ్చాడు. దేవదేవుడైన విష్ణుమూర్తికి పూలతో, తులసీదళాలతో యథావిధిగా పూజించాడు. అంతకుముందు మహారాజు పూజ చేసిన మణులు, రత్నాలు ఈ బ్రాహ్మణుడు చేసిన దళాలతో, పూలతో కప్పబడిపోయాయి. దానితో రాజు కోపించి 'బ్రాహ్మణా! నేను బంగారు పూలతో, మణులతో, రత్నాలతో పూజించాను. అవి ఎంతో శోభను వెదజల్లుతున్నాయి. నీవు వచ్చి అవన్నీ కప్పబడిపోయేటట్లు పూజ చేశావు. నీవు చాలా మూర్ఖుడవనిపిస్తోంది. నీకు భక్తి లేదనిపిస్తోంది' అని నిందించాడు. అప్పుడా బ్రాహ్మణుడు 'మహారాజా! మీరు రాజసంపద కారణంగా దర్పాన్ని పొందుతున్నారు. అది నిజమైన భక్తి అనిపించుకోదు' అన్నాడు.

రాజు కోపించి, 'ఈ రోజు నుండి మనమిద్దరమూ వైష్ణవ వ్రతాన్ని ఆచరిద్దాం. మనిద్దరిలో ఎవరు ముందుగా విష్ణు దర్శనం పొందుతారో చూద్దాము' అని తన రాజ భవనానికి వెళ్ళిపోయాడు. రాజగురువు సలహా మేరకు అనేకమంది ఋషులను ఆహ్వానించి, వైష్ణవ యాగం ఆచరించాడు. ఋషులందరినీ భోజనాలతో తృప్తిపరచి, దక్షిణలతో ఆనందపరచాడు. బ్రాహ్మణుడు దైవమందిరంలోనే నిత్యమూ శాస్త్ర నియమాలను అనుసరించి, అత్యంత భక్తితో వైష్ణవ వ్రతానుష్ఠానం చేయ సాగాడు.

మహారాజు కూడా నియమ నిష్ఠలతో, అత్యంత భక్తి భావనతో నిత్యమూ విష్ణుమూర్తిని పూజిస్తున్నాడు. విష్ణుమూర్తి దర్శనాన్ని అత్యంత శీఘ్రంగా పొందాలనే పట్టుదలతో విష్ణుమూర్తిని ఆరాధించసాగాడు. బ్రాహ్మణుడు మాఘమాస వ్రతము, కార్తీక వ్రతములను, ఏకాదశీ వ్రతాన్ని నియమ నిష్ఠలతో ఆచరిస్తూ 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షర మంత్రాన్ని అనుక్షణము జపిస్తూ ప్రతిదినమూ మహావిష్ణువును పూజించసాగాడు. నడుస్తూ, భుజిస్తూ, నిద్రిస్తూ..... ఇలా సర్వకాల సర్వావస్థలలో కూడా శ్రీవిష్ణువును జపిస్తూ వుండేవాడు. అందరినీ సమానంగా చూస్తూ, ప్రాణులన్నింటిలోనూ విష్ణుమూర్తిని దర్శించేవాడు.

ఒకరోజు బ్రాహ్మణుడు నిత్యకర్మ ఆచరించిన తరువాత ప్రసాదం సిద్ధం చేశాడు. కానీ దానిని ఎవరో దొంగిలిచారు. దొంగను ఎవరూ చూడలేదు. ప్రసాదం మళ్ళా చేద్దామంటే కాలాతీతమయింది. సాయంకాల పూజకు విఘ్నమవుతుందని విరమించాడు. రెండవ రోజు కూడా ప్రసాదం అపహరింపబడింది. ఈ విధంగా వరుసగా ఏడు రోజులు జరిగింది. ఎనిమిదవ రోజు ప్రసాదం సిద్ధం చేసి, బ్రాహ్మణుడు చాటుగా నిలబడి చూడసాగాడు. ఇంతలో ఒక ఛండాలుడు వచ్చి, ప్రసాదం దొంగిలించుకు పోవడానికి సిద్ధంగా వున్నాడు. అతని శరీరమంతా నీరసించిపోయి వున్నది. ముఖంపై దీనత్వం, శరీరంపై చర్మము ఎముకలు తప్ప ఏమీ లేవు. అతడిని చూడగానే బ్రాహ్మణుడి హృదయం ద్రవించిపోయింది. హృదయం కరుణతో నిండిపోయింది. ఆ బ్రాహ్మణుడు ఆ ఛండాలుని వుద్దేశించి 'సోదరా! ఆగు, కొంచెం నెయ్యి కూడా వేస్తాను' అనేసరికి ఆ ఛండాలుడు భయపడి పరుగెత్తి, నీరసంతో అక్కడే క్రింద పడిపోయాడు.

బ్రాహ్మణుడు అతనిని లేవదీసి, ప్రక్కనే కూర్చుని, సకల ఉపచారాలు చేశాడు. కొంతసేపటికి ఆ ఛండాలుడు కళ్ళు తెరిచి చూశాడు. సేదతీరి లేచి నిలబడ్డాడు. అతనివైపే చూస్తున్న బ్రాహ్మణునికి ఛండాలుని స్థానంలో శంఖ చక్ర గదా పద్మాలను ధరించిన శ్రీవిష్ణువు దర్శనమిచ్చాడు. పీతాంబరం ధరించి, చతుర్భుజాలతో, ఎదపై శ్రీవత్సం తలపై కిరీటం ధరించి శోభిల్లుతున్నాడు. కౌస్తుభమణితో ప్రకాశిస్తూ, నీలమేఘ ఛాయతో మెరిసిపోతున్న ఆ ప్రభువును చూసి, ఆ బ్రాహ్మణుడు పులకించిపోయాడు. ప్రభువును స్తుతించాలని గానీ, నమస్కరించా లనిగానీ అతనికి స్ఫురించలేదు. శ్రీ మహావిష్ణువు అతనిని అక్కున జేర్చుకుని తనతోపాటుగా వైకుంఠానికి తీసుకువెళ్ళాడు.

ఆ బ్రాహ్మణుని శ్రీ మహావిష్ణువు తనతోపాటు వైకుంఠానికి తన విమానంలో తీసుకువెళ్ళడం మహాభక్తుడైన మహారాజు కూడా చూశాడు. విష్ణుదర్శనం కలగాలంటే కేవలం దానధర్మాలు, యజ్ఞయాగాలు సరిపోవనీ, ప్రధానంగా భక్తి కావాలనీ, తాను భక్తుడననే అహంకారాన్ని విడనాడాలనీ ఆ రాజు గ్రహించాడు. రాజుకు కుమారులు లేనందున తన అల్లుడినే మహారాజుగా అభిషిక్తుణ్ణి చేసి, యజ్ఞకుండం ఎదురుగా నిలబడి, శ్రీ మహావిష్ణువును ప్రార్థిస్తూ 'ఓ దేవా! నాకు మనస్సు వాక్కు, శరీరము, కర్మల ద్వారా నిశ్చల భక్తిని ప్రసాదించు' అని పలికి అగ్ని ప్రవేశం చేశాడు. భక్తవాత్సల్యుడైన విష్ణుభగవానుడు ప్రత్యక్షమై ఆ మహారాజును కూడా తనతోపాటు వైకుంఠానికి తీసుకువెళ్ళాడు.

# శివుని కథలు

- రమణ ప్రసాద్

## లింగోద్భవుడు

"శివుని శిరమును, పాదమును చూడదలచి విఫలులైన బ్రహ్మ విష్ణువులకు, జటాజూటధారియై ఒక చేతిని తొడపైనుంచి, ఇంకొక చేతిని లేడిపైనుంచి మిగిలిన చేతులతో డమరుకమును, త్రిశూలమును ధరించి విరాజమానమై ఉన్న సదాశివుని ధ్యానిస్తున్నాను."

సృష్టికి పూర్వం బ్రహ్మ విష్ణువుల మధ్య ఎవరు గొప్ప? అనే వివాదం వచ్చింది. "నేను సృష్టికర్తను. కాబట్టి నేను గొప్ప" అన్నాడు బ్రహ్మ. పోషించేవాడు లేకపోతే సృష్టి చేసి లాభమేముంది? పోషించేవాడను నేను కనుక నేనే గొప్ప" అన్నాడు విష్ణుమూర్తి. వారి వాగ్యుద్ధం పెరిగి తీవ్రరూపం దాల్చింది. ఆ సమయంలో వారికి కనువిప్పు కలుగ జేయటానికి ఒక పెద్ద అగ్ని స్థంభం వారి ముందు నిలిచింది. అది చూసి బ్రహ్మ విష్ణువులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. "ఈ సంథభం యొక్క ఆదిని అంతాన్ని ఎవరు ముందు చూస్తారో వారే మనలో గొప్ప" అని నిర్ణయించుకున్నారు. బ్రహ్మ తన హంస వాహనం ఎక్కి స్థంభం కొన భాగం చూడటానికి బయల్దేరాడు. విష్ణువు ఒక అడవి పందినెక్కి అధోభాగం చూడటానికి బయల్దేరాడు.



ఆ స్థంభం సాధారణమైన అగ్ని స్థంభం కాదు. రూప గుణ రహితుడైన దేవ దేవుడే ఆ రూపంలో వచ్చాడు. ఆది మధ్యాంత రహితుడైన ఆ దేవదేవునికి మొదలెక్కడ? చివరెక్కడ? బ్రహ్మ విష్ణువులు వెదికి వేసారి విఫలులైయ్యారు. ఈ స్థంభ రూపంలో ఉన్నది సాక్షాత్ పరమ శివుడే అని గ్రహించి విష్ణువు తన ఓటమిని ఒప్పుకున్నాడు. బ్రహ్మకూడా విఫలుడైనాడు. కాని తాను స్థంభంపై ఉపరి భాగాన్ని చూశానని అబద్ధం చెప్పాడు. ఆ అబద్ధం బయట పడి తత్ఫలితంగా బ్రహ్మకు ఎక్కడా పూజలు లేకుండా పోయాయి. వారిరువురూ సదాశివుడే గొప్ప అని అంగీకరించారు. కరుణాళువైన శివుడు పశువులు(జీవులు) అందరూ సేవించే విధంగా లింగాకారంగా వెలిశాడు. అగ్ని రూపంలో ఉన్న ఆ

స్థంభానికి ఒక రూపం, ఆకారం లేదు. అది పరంజ్యోతి స్వరూపం. శివుడు తన నిజ స్వరూపం ధరించి వచ్చి బ్రహ్మ, విష్ణువులకు దర్శనం ఇచ్చాడు.

బ్రహ్మ విష్ణువులను అనుగ్రహించవచ్చిన ఆ నిరాకార బ్రహ్మమే ఈ లింగం అని శైవుల విశ్వాసం. కాబట్టి ఆయనను “లింగోద్భవుడు”గా ఆరాధిస్తారు. అగ్ని నుంచి వచ్చేది విభూది కాబట్టి దానిని పవిత్రమైన భస్మంగా శివ భక్తులు ధరిస్తారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

డిశంబర్2017

03 ఆది - పూర్ణిమ; శ్రీసద్గురుదేవులు ఆంగ్లకాలమాన ప్రకారం స్వస్వరూపలయస్థితిని పొందిన రోజు. ఉ-11 గం॥లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

12 మంగళవారం - శ్రీగురుదశమి, సాయంత్రం 5గం॥30నిలకు శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

25 సోమవారం - క్రిస్మస్ - ఉదయం 11గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

29 శుక్ర - ముక్కోటిఏకాదశి. సా॥ 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

జనవరి 2018

01 సోమ - ః ఆంగ్ల సంవత్సరాది, సాయంత్రం 5గం॥ల30నిలకు. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

02 మంగళ -పూర్ణిమ, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14 ఆది -భోగి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, శ్రీబాబుకు భోగిపళ్ళుపోయటం, భక్తసమారాధన.

15 సోమ- మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, సాయంత్రం 5గం॥ల30నిలకు,సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

11 గురు -శ్రీ గురు దశమి, సాయంత్రం5గం॥ల30నిలకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

20-1-2018 నుండి 26-1-2018 వరకు వార్షిక సత్సంగ సమావేశములు.

22 సోమ - మాఘ శుద్ధ పంచమి - శ్రీ సద్గురు క్షీర శిలామూర్తుల ప్రతిష్టా తృతీయ వార్షిక మహోత్సవము.

31- బుధ - మాఘపూర్ణిమ. సా॥ 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# షట్కమలములు

-పరాశర ప్రసాద్

పరబ్రహ్మమునకు ఏ రకమైన వికారములు లేవు. మాయ జడము. కర్తృత్వము, భోక్తృత్వము స్వరూపముగా గలది సంసారము. జడమైన మాయకు సంసారము లేదు. నిర్వికారుడైన బ్రహ్మకు సంసారమను ప్రసక్తి లేదు. మరి సంసారము ఎవరికి? హంస స్వరూపుడైన జీవునికి సంసారము వున్నది. మాయతో తాదాత్మ్యము చెందిన బ్రహ్మమే జీవుడు. తొమ్మిది వాకిళ్ళుగల పురములో ప్రవేశించి, దేహేంద్రియాదులతోనూ, మనస్సుతోనూ సంసారమును అనుభవిస్తున్నాడు.

శరీరమను పురములోగల జీవుడే హంస. కోటి సూర్య ప్రకాశముతో ప్రకాశించుచూ మూలాధారము నుండి సహస్రారము వరకు తెల్లని స్ఫటికము వలె వెలుగుచూ ఉండే జీవుడే పరబ్రహ్మమనే పరమార్థతత్త్వము ఎరిగినవాడే ధన్యజీవి. జీవాత్మ ప్రాణము, మనస్సుతో కూడి అనుక్షణము అనగా ఇరువది నాలుగు గంటల కాలములో షట్కమలములైన మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము, అనాహతము, విశుద్ధము, ఆజ్ఞ అను షట్కమలముల యందు 21,600 పర్యాయములు సంచరించును.

1. **మూలాధార చక్రము** గుదస్థానమునందున్నది. దానికి నాలుగు దళములు. అది మేలిమి బంగారు వన్నెను కలిగి వున్నది. దాని యందు భూమి వాసము చేయును. అది నాసికకు మూలము. దాని అధిదేవత వినాయకుడు. హంస ఈ చక్రమునందు 600 పర్యాయములు సంచరిస్తుంది.

2. **స్వాధిష్ఠాన చక్రము** లింగస్థానమునందున్నది. దీనికి ఆరు దళములు. ఇది ఎఱ్ఱని వన్నె కలిగినది. జలమునకు ఆవాసము. ఇది నాలుకకు మూలము. అధిదేవత బ్రహ్మ. హంస ఇందు ఆరువేల పర్యాయములు సంచరిస్తుంది.

3. **మణిపూరకము** నాభిస్థానమునందున్నది. దీనికి పది దళములు. దీని యందు అగ్ని వశించును. పసుపు వన్నె కలది. కన్నులకు మూలము. ఈ చక్రమునకు అధిదేవత విష్ణుమూర్తి. హంస ఆరువేల పర్యాయములు సంచరిస్తుంది..

4. **అనాహతము** హృదయ స్థానమునందున్నది. దీనికి 12 దళములు. దీని యందు వాయువు వశించును. ఈ చక్రము త్వగింద్రియమునకు మూలము. తెల్లని వన్నె కలిగియుండును. దీనికి అధిదేవత రుద్రుడు. హంస ఆరువేల పర్యాయములు సంచరిస్తుంది.

5. **విశుద్ధ చక్రము** కంఠమునందు కలదు. దీనికి 16 దళములు వున్నాయి. ఇది ఆకాశమునకు స్థావరము. ఇది నల్లని వన్నె కలది. ఇది చెవులకు ఆధారము. దీనికి అధిదేవత జీవాత్మ. హంస వేయి పర్యాయములు సంచరిస్తుంది.

6. **సహస్రార కమలము** బ్రహ్మరంధ్రమునందున్నది. దీనికి వేయి దళములు వున్నాయి. దీని బీజాక్షరము ఓంకారము. ప్రకాశవంతమైన ఈ చక్రమునందు బుద్ధి లయమవుతుంది. దీనికి అధిదేవత దేశికుడు. హంస వేయి పర్యాయములు సంచరిస్తుంది. సద్గురు మూర్తి ఆదేశాను సారము యోగ మార్గంలో సాధన చేసి హంస సంచారము గుర్తెరిగిన వాడు జీవన్ముక్తుడే.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

డిశంబర్ 2017

03 ఆదివారం -పౌర్ణమి(శ్రీ దత్తాత్రేయ జయంతి) శ్రీసద్గురుదేవులు స్వస్వరూపులయిన ఆంగ్ల దినము - రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

12 మంగళవారం - శ్రీ గురుదశమి -రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

16 శుక్రవారం నుండి ధనుర్మాస ప్రారంభం. - నెలరోజులు ఉదయం 5గం.లకు శ్రీసద్గురుపాదపూజ; ; నగరసంకీర్తన. తిరుప్పావై; ముకుందమాల పారాయణ.

జనవరి 2018

02 మంగళవారం - పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

11 గురువారం శ్రీ గురుదశమి, రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

14 ఆదివారం - భోగి -రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాదపూజ, భోగిపళ్ళు.

15 సోమవారం - మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

27 శనివారం భీష్మ ఏకాదశి 27- 31వ తేదీ వరకు శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠ వార్షికోత్సవాలు, సత్సంగ కార్యక్రమాలు.

31 బుధ : మాఘ పౌర్ణమి - సత్సంగం,శ్రీ గురు పాదపూజ, భక్త సమారాధన, (సంపూర్ణ చంద్ర గ్రహణం)

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

"ఎవరైతే తన అశుద్ధ మనసును కూకటి వేళ్ళతో పెరికి వేస్తాడో, అప్పుడతడు పునర్జన్మలను తరిమివేయగలడు, ఏ బాధలతనిని చలింప చేయలేవు. మహనీయులు శుభ వాసనలు (శుద్ధ)తో చేసే కార్యములు, పునర్జన్మకు దారితీయవు. నీ వెప్పుడు ఆత్మ జ్ఞానము, లేక బ్రహ్మ జ్ఞానమును పొందుతావో, అప్పడశుద్ధ వాసనలన్నీ పూర్తిగా వేగి, వేగి మాడిపోతాయి. ధ్యానము, జపము, కీర్తన, ప్రాణాయామము, బ్రహ్మ విచారణ, పవిత్ర గ్రంథ పఠనము, సత్సంగము వలన శుద్ధ వాసనలు వుత్పన్నమౌతాయి.



ఎప్పుడైతే మనసు వస్తువులపై కోరికల నుండి విముక్తి పొందుతుందో, ఎప్పుడైతే మనసు ఆత్మ యందు నిలకడగా నిలుస్తుందో, అప్పడు మనసు భౌతిక వస్తువులు, లేక విషయాలపై ప్రాకులాడకుండా స్వేచ్ఛను పొందుతుందో, అదెప్పుడు అదుపులో వుండి, హృదయం మధ్యలో నిలుస్తుందో, ఎప్పుడది సత్యాన్ని (ఆత్మను) పొందుతుందో, అదే మోక్షము లేక జీవిత సౌందర్యానికి పరాకాష్ఠ.

"ఓ రాజా! నీ మనసును చలించనీయ వద్దు, భౌతిక విషయాలపై పరుగిడనీయ కుండా స్వేచ్ఛగా వుంచు, వుదాత్తమైన లేక శుద్ధమైన మనసుతో అశుద్ధమైన మనసును నిర్మూలం చేయి. తరువాత శుద్ధ మనసును కూడ అధిగమించు, నీవు శిలలా స్థిరముగా వుండుగాక, నీవు శుద్ధ లేక సాత్త్విక మనసుతో వర్థిల్లుదువు గాక! నీవెప్పడూ నిత్యానంద భరితమైన ఆత్మలో ప్రశాంతంగా విశ్రమింతువుగాక! అప్పడు శిఖిధ్వజుడిలా అన్నాడు "ఓ పూజ్య గురుదేవా! నాకు యీ విశ్వము యొక్క వుత్పత్తి, లయముల గురించి, వివరించవలసినది. మనము జీవాత్మను, నిరంతరము పవిత్రము, స్వయం ప్రకాశమైన బ్రహ్మము, లేక పరమాత్మతో లయంచేయుట యెలా సాధ్యము?".

కుంభముని యిలా సమాధానము చెప్పాడు, "యద్దృశ్యంతన్నశ్యం" యని కంటికి గోచరించేదంతానశించేది, అవి

ప్రళయము లేక మహా కల్పము చివర అంతమౌతాయి. కాని ప్రశాంతము, సర్వ వ్యాపకము, నిత్యానంద భరితము, వినాశరహితము, పవిత్రము, తేజోమయమైన బ్రహ్మము మాత్రము నశించేదికాదు. ఎప్పుడు వుండేది, ఒక సమయంలో నీరు అలగా మారినట్లు, అలాగే యీ జగత్తు కూడ పెరిగి, తిరిగి ఆ బ్రహ్మము లేక పరమాత్మలో లీనమవుతుంది. ఎలాగైతే బంగారముతో గాజులు, వుంగరాలు గొలుసులు మున్నగు వివిధ రకాల ఆభరణములు తయారయినట్లు, యీ ప్రపంచమునకు సంబంధించిన నామాలు, రూపాలు బ్రహ్మము నుండి వచ్చాయి. ఈ విశ్వమంతా ద్వైతరహితమైన చిన్మాత్ర తప్ప మరేమికాదు, ఏ విధంగా అల సముద్రపు నీటి కన్న భిన్నము కాదో, అలాగే జగత్తు, పరమాత్మ కంటే భిన్నము కాదు.

బ్రహ్మము, శివము, సత్యము, చిన్మాత్ర, సత్‌చిత్ అన్ని వొక దానికొకటి పర్యాయ పదములు మనసులో వొక చిన్న కదలిక యీ విశ్వాన్ని సృష్టిస్తుంది, నీవు ఆత్మ సాక్షాత్కారమును పొందితే యీ విశ్వమ దృశ్యమవుతుంది. ఏ విధంగా చీకటిలో తాడును చూచి, పామని భ్రమించినట్లు, అజ్ఞానములో జగత్తు నిత్యమును కొంటున్నాము, బ్రహ్మ మాయా జనితమైన ప్రపంచముగా గోచరిస్తుంది. వివిధ రకాలైన ఆభరణాలెలాగ బంగారము యొక్క వివర్తమో, అలాగే యీ విశ్వము బ్రహ్మ యొక్క వివర్తము.

బ్రహ్మ యొక్కదానికే నిజమైన వునికి వున్నది. బ్రహ్మమే అన్నిటికి మూలాధారము. వున్నదంతా బ్రహ్మ తప్ప, తద్భిన్నమైనది యేమి లేదు, బ్రహ్మే యీ విశ్వము యొక్క సారాంశము, ప్రకృతిలో యెన్ని రకాలు, వైవిధ్యాలు వున్నా, బ్రహ్మము ద్వైతమునకు తావు లేని యేకత్వము. ప్రపంచము, అహంకార స్వభావమును గురించి, విచారణ చేయటం నిరుపయోగము, ఎందుకంటే వాటికి వాస్తవంగా వునికి లేదు, తాటిలోని పాములా అవి కేవలము మాయా జనిత దృశ్యాలు, అహంకారమనే భావన, ప్రపంచము కేవలము అర్థరహితమైనవి. అవి కేవలము మనసుతో సృష్టింపబడ్డవి. "నేను, నీవు, ఇది, అది" అనేవి వొకదాని నుండి మరొక దానిని భిన్నంగా తెలుసుకోటానికి, మానవ నిర్మిత పదాలు, అవి కేవలము వూహాజనితమైనవి వాటికి నిజంగా వునికిలేదు, "నేను, నీవు, వాడు, వారు, అది" మున్నగునవి, మనకు స్వప్నంలో కనిపించే దృశ్యాల్లాంటివి.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

డిశంబర్ 2017

03 ఆది -పౌర్ణమి, శ్రీ సద్గురుదేవులు స్వస్వరూపులయిన ఆంగ్ల దినము - శ్రీదత్తాత్రేయ జయంతి. శ్రీ సద్గురు పాద పూజ.

12 మంగ - శ్రీ గురు దశమి,- సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

16 శని - శని త్రయోదశి- మాస శివ రాత్రి. పావులూరులో ఏకాహం, ధనుర్మాస ప్రారంభం.

18 సోమ - అమావాస్య.

.25 సోమ - క్రిస్మస్ - శ్రీసద్గురుపాదపూజ.

29 శుక్ర - ముక్కోటి ఏకాదశి, ఉత్తరద్వార దర్శనము; శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

జనవరి 2018

1 సోమ - ఆంగ్ల సంవత్సరాది. శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

2 మంగ - పూర్ణిమ ,శ్రీ సద్గురు పాద పూజ

6 శని - శ్రీత్యాగ రాజ స్వామి వారి ఆరాధన.

11 గురు - గురు దశమి, సత్సంగము, శ్రీ సద్గురు పాద పూజ

14 ఆది - భోగి పండుగ, శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపళ్ళుపోయుట.

15 సోమ - సంక్రాంతి; శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన, ఉత్తరాయణ ప్రారంభం. మాస శివ రాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

16 మంగ- కనుమ పండుగ, అమావాస్య.

24 బుధ - రథ సప్తమి

26 శుక్ర - రిపబ్లిక్ డే

27 శని - భీష్మ ఏకాదశి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

31బుధ -గురు మాఘపూర్ణిమ, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

సద్గురుదేవుల సమక్షంలో మానవుడి గుణాలకి, స్వభావానికి గల సంబంధం ఏమిటి? ఈ రెండూ వేరుగా ఉన్నాయా లేక ఒక్కటేనా అన్న అంశం చర్చకు వచ్చింది.

స్వభావం అంటే ప్రవర్తన. ఆంగ్లంలో attitude అనవచ్చు. అది మనస్సుపై ఆధారపడి ఉంటుంది. మనస్సు అంటే భావన. గుణాలు అనేవి మానవుని వ్యక్తిత్వం అంటే ఉపాధి లక్షణం. ఉపాధికి సహజ లక్షణాలు



వుంటాయి. అయితే అవి ప్రభావితం కావడానికి మనస్సు సహకరించ వలసి వుంటుంది. మనస్సు ప్రభావితం కావటానికి పరిసరాల తోడ్పాటు వుంటుంది. మానవుడు జన్మకి వచ్చినప్పుడు ఉపాధి ఎంపిక, పరిసరాల ఎంపిక ఆ జీవుని సంస్కారాన్ని అనుసరించి వుంటుంది.

సంస్కారము అంటే జన్మకి కారణమైన కారణ శరీరము లేక వాసన. సంస్కారము అనేది జీవుడిలో బీజ రూపంలో దాగి ఉంటుంది. సమయం వచ్చినప్పుడు సంకల్ప రూపంలో అది బయలు పడుతుంది. సంకల్పం సఫలీకృతం కావడానికి మనస్సు, బుద్ధి, అవయవాలు అన్నీ సహకరిస్తాయి. అయితే వాసనని రహితం చేసుకునే మార్గమే లేదా! అంటే ఉంది. అదే సద్గురుమూర్తి పరమానుగ్రహము!

విశాఖపట్నంలో సద్గురుదేవులు భక్త సమావేశాలలో పాల్గొనే రోజులలో ఒకనాడు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గారు సద్గురు దేవుల దర్శనార్థం వచ్చారు. ఆయనకి ముక్కుపొడుం పీల్చే అలవాటు వుంది. ఆయన సద్గురుదేవులకు పాదాభివందనం చేసుకున్నారు. పాదాలకు ముక్కుపొడుం  అంటుకుంది. ఆ ప్రక్కనే వున్న నేను నా పంచతో శుభ్రం చేయటం జరిగింది.

శ్రీసద్గురుదేవులు మాట్లాడుతూ, "నా కాలికి అంటుకున్నది నేను నీటితో కడుక్కుంటే పోయేది. అనవసరంగా నీ తెల్లటి వస్త్రానికి అంటించుకున్నావు. అది వస్త్రాన్ని వదిలిపెట్టదు. ఎంతకాలమో దాన్ని పోగొట్టటానికి నీవు కష్టపడాలి. ప్రాపంచిక విషయాదులను కూడా ఇలాగే అంటించుకుంటావు. అవి మనస్సును వదలమంటే వదులుతాయా?" అన్నారు. "మనస్సుని ప్రపంచంలో పడవేస్తే అది

కామక్రోధాది గుణాలకు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలైన పంచతన్మాత్రలకు ఈర్ష్య ఆసూయ రాగ ద్వేషాలకు గురికాక తప్పదు సుమా! దాని నుండి బయట పడటం చాలా కష్టం" అని హెచ్చరించారు.

ప్రాపంచిక విషయాదులవైపు మొగ్గుచూపటం మనస్సు యొక్క స్వాభావికం. మనస్సును దాని నుండి రక్షించాలంటే, ప్రత్యామ్నాయంగా మనస్సుకి వేరొక ఆలంబనము లేక ఆహారాన్ని అందించాలి. కాబట్టి కారణాన్ని నిరోధిస్తే కార్యం నిలిచిపోతుంది. అయితే మానవునికి అది సాధ్యమా! మనస్సు యొక్క కారణాన్ని ప్రోత్సహించేది గుణాలు. కారణం అనేది వాసన. కార్యము జరగటానికి ఆధారము. వాసన గుణాలను ప్రేరణ చేయటం చేత, గుణాలు మనస్సుపై ప్రభావాన్ని చూపుతాయి. వాసనా రహితం కావాలంటే సద్గురుమూర్తి అనుగ్రహాన్ని సంపాదించాలి. గుణము అంతర్గతము. అది సంకల్పరూపంలో అంతర్గతంగా వుంటుంది. అది క్రియా రూపమైతే స్వభావంగా బహిర్గతం అవుతుంది. మనస్సుని నియంత్రించాలంటే బుద్ధి ఉత్తేజిత మవ్వాలి. బుద్ధి ప్రేరణచేత మనస్సు బుద్ధిలో లయమవుతుంది. అలా జరగాలంటే సద్గురు మూర్తి బోధా శ్రవణం చేయాలి. శ్రవణం ద్వారా బుద్ధి సూక్ష్మరూపాన్ని పొంది మనస్సుని తనవైపు త్రిప్పుకుంటుంది. అదే మనోలయం.

అందువలన సద్గురుమూర్తి సమాశ్రయం ఆయన బోధా శ్రవణం చేయాలి. బోధా శ్రవణం ద్వారా బుద్ధిలో శ్రద్ధ అంకురిస్తుంది. శ్రద్ధ గురుప్రసాదితమేగాని, స్వార్జితం కాదు. శ్రద్ధ ద్వారా ఆసక్తి, అనురక్తి కలిగి మనస్సును ప్రేరణచేసి, వివేకవంతమైన విచారణకి ప్రోత్సహిస్తుంది. అదే సాధనకి అనువైన సమయం.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల ప్రియతమ భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన నడింపల్లి సత్య సూర్యనారాయణ రాజు (ఎమ్.డి)గారు అక్టోబర్ 29 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరు గత కొద్దికాలంగా అస్వస్థతతో ఉన్నారు. వీరి వయస్సు 77 సంవత్సరాలు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియుజేస్తున్నాము.

శుభాభినందనలతో ...


Grand

RADIATORS

**AN ISO 9001:2008 CERTIFIED COMPANY**

Manufactures of Radiators (Automobile and Industrial), Oil Coolers, Air Coolers, After Coolers, Inter Coolers, Finned Tube Coolers, Shell and Tube Heat Exchngers,Tube Bundles,Condernsers,Cooling Coils,All Pre-Heaters, Large After Coolers and Mechanically Bonded Radiators









# GRAND RADIATORS

PLOT NO 131, BLOCK – D, AUTONAGAR,
VISAKHAPATNM -530012.AP, INDIA
TELPHONE: 0891-2517706, 2564538, FAX NO. 0891-2513660, 2502640
E-mail: grandradiator@yahoo.in Website: www.grandradiators.com

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

తృతీయాశ్వాసము - 95 శ్లో॥

అయం క్షీరామ్భోధేః పతిరితి గావాం పాలక ఇతి।
శ్రితోస్మాభిః క్షీరోపనయన ధియా గోపతనయః।
అనేన ప్రత్యూహోప్యరచి సతతం యేనజననీ।
స్తనాదప్యస్మాకం సకృదపి పయో దుర్లభమభూత్॥

తాత్పర్యము -



ఈ గొల్లపిల్లవాడు పాల సముద్రమునకు రాజనియు, గోవులకు కాపరియనియు, పాలను సంపాదించుకొన వలయునను తలంపుచేత మాచేత ఆశ్రయింపబడెను. ఏ కారణము చేతను ఎల్లప్పుడూ మాకు తల్లి చంటినుండి ఒకప్పుడైననూ పాలు పొందనలవి కానియు ఆమెనో ఆ కారణము చేత, ఈ కృష్ణుని చేత పాలు దొరుకుటకు ఆటంకము చేయబడినది (మరల జన్మము రాదనుట). ఈ కృష్ణుడు పాల సముద్రమునకు రాజనియు, గోవులను పాలించువాడనియు ఎంచి, మనకు వలసినన్ని పాలు దొరుకునన్న అభిలాషచేత వీవని ఆశ్రయించితిమి. ఈతనిని సేవింప మొదలిడినది మొదలు మా తల్లి చనుబాలకు కూడా కరువయ్యెను. (పునర్జన్మ లేని స్థితి లభించింది.)

'తాతా! ఆకలేస్తున్నది అమ్మ అక్కడ ఉన్నదా ఇంట్లో?' అన్నాడు సత్తెన్న. 'ఇప్పుడే కదరా! మీరంతా వచ్చి ఇంట్లో పాలు, పెరుగు అంతా తాగేసి వెళ్ళారు. అమ్మ అక్క మధురానగరి వెళ్ళారు' అన్నాడు తాతయ్య.

'నేనిప్పుడే వచ్చాను తాతయ్య. ఇందాక మా నేస్తాలందరూ వచ్చారేమో. కన్నయ్య కూడా వచ్చే వుంటాడు! అందరికీ పాలు పెరుగు యిచ్చి వుంటాడు. సరే అయితే అమ్మ పొద్దున్న యిచ్చిన చల్ది బువ్వ తిని, గోవులు మేపుకుంటూ ఆడుకునే సరికి అదికాస్త అరిగిపోయింది. ఇప్పుడు కాసిని పాలుతాగుదామని వచ్చాను. సరే! వెళ్ళి ఆ కృష్ణుణ్ణే అడుగుతాను' అని తుర్రుమన్నాడు.

బృందావనంలో పారిజాతం చెట్టు క్రింద పాలరాతి అరుగుమీద కూర్చుని మురళీ వాయిస్తున్న కన్నయ్యను చూసి, పిల్లలందరూ చుట్టూ చేరి 'పాలు కావాలి మాకు' అని అడిగారు. అక్కడే వున్న గోపికలు వాళ్ళను చూసి, 'మనతో కలసి ఆడుతూ పాడుతూ మనలను కవిస్తూ వుండే కృష్ణయ్య అంటే ఎవరనుకున్నార్రా!' అని అనగానే, 'ఎవరో తెలిస్తే మీరే మాకు చెప్పండి' అన్నారు పిల్లలంతా కలసి.

"మేమంతా నంద మామగారింటికి వెడితే, పెద్ద పెద్ద చదువులు చదువుకున్న అయ్యలు వాళ్ళింటికి వచ్చి, నందమామతో చెప్పారని ఆయన చెప్పగా విన్నాము. మన కృష్ణయ్య పాల సముద్రంలో పాము మీద పడుకునే విష్ణుమూర్తిట. ఆయనే మనందరికోసం బుల్లికన్నయ్యగా ఇక్కడకు వచ్చాడట."

అది వింటూనే సత్తెన్న ఎగిరి గంతేసి, 'అయితే పాల సముద్రంలో పాము మీద పడుకుంటే అది ఎవరు?' అని అడిగాడు. గోపికలు సమాధానంగా మనలాగే పాములు, కోతులు, గోవులూ, నెమళ్ళు అన్నీ మన కన్నయ్యకి నేస్తాలే కదారా' అన్నారు.

'అందుకే మన కన్నయ్య పాలడిగితే బోలెడు యిస్తాడు కదా' అన్నాడు సత్తెన్న. 'ఆఁ వ్రేపల్లెలో బుల్లికన్నయ్య గోవుల కాపరి కదా! కన్నయ్య గోవు పాదుగును తాకితే గోవులు కుండలన్నీ పొర్లిపోయేటట్లు పాలు కురిపిస్తాయి' అన్నారు గోపికలు. పిల్లలందరూ కలసి కన్నయ్యతో 'పాల సముద్రానికి రాజువి, గోవుల కాపరివి కదా కన్నయ్యా! మాకు ఆకలిగా వుంది పాలు ఇవ్వవా? ఆకలివేస్తోంది మాకు' అని అడిగారు.

అది విని కన్నయ్య "నన్నే నమ్ముకున్నామన్నారు కాబట్టి, ఎప్పుడూ నన్నే సేవిస్తున్నారు కాబట్టి, మీ అందరికీ మళ్ళీ తల్లి కడుపులో పెరిగి జన్మ ఎత్తి లోకంలో ఇక ఇక్కట్లన్నీ పడకుండా, పునర్జన్మమే లేని స్థితిని ప్రసాదిస్తున్నాను. ఈ పాలు కాకుండా, తల్లిపాలు కూడా లేకుండా చేస్తున్నాను. ఎప్పుడూ నాలో కలిసిమెలసి వుంటూ, నేనే మీరైపోయేటట్లుగా వరం యిస్తున్నాను" అని అభయమిచ్చాడు కన్నయ్య!

అటువంటి విష్ణుస్వరూపుడైన నందబాలుడు మనలనందరినీ రక్షించుగాక!!

శుభాభినందనలతో ...



VennTech
Manufacturer of
Ventilation System /
Air Handling Equipments
for Marine applications
PRODUCTS :
Blowers
ATU'S
Coolers
Moisture Separaters
Heat Exchangers
PLOT NO: 1-125/17/A, MIE, HAFEEZPET, MIYAPUR, HYDERABAD – 500 049.
MOBILE: 9000410044, TEL : 040 – 64100589, FAX:040-23116650
E-MAIL: VENNTEC@GMAIL.COM

# సుందరాకాండ వైశిష్ట్యము

- రమణ ప్రసాద్

శ్రీమద్రామాయణ కావ్యంలోశ్రీరాముని బాల్యలీలలు వర్ణించటం వలన బాలకాండ అని, పట్టాభిషేక సన్నివేశాలను వర్ణించటం వలన అయోధ్యకాండ అని, శ్రీ సీతారామలక్ష్మణుల అరణ్యవాస విశేషాలు వర్ణన వలన అరణ్యకాండ అని, అదే విధంగా రామ సుగ్రీవుల మైత్రి కిష్కింధలో జరగటం చేత కిష్కింధకాండ అని, రామ రావణ యుద్ధ వర్ణన వలన యుద్ధకాండ అని పేర్లు వచ్చాయి. కిష్కింధకాండకు, యుద్ధకాండకు మధ్య గల వస్తు సౌందర్యానికి, సీతారాముల సౌందర్య వర్ణనలకు, సీతాన్వేషణలో ఎదురైన సుందర ఘట్టముల వలన దీనికి "సుందరకాండ" అని పేరు వచ్చింది. ఈ అనేక అద్భుత సౌందర్య సంపుటినే ఇలా చెబుతున్నారు:



సుందరే సుందరో రామః, సుందరే సుందరీ కథా ।
సుందరే సుందరీ సీతా, సుందరే సుందరం వనం ॥
సుందరే సుందరం కావ్యం, సుందరే సుందరః కపిః ।
సుందరే సుందరం మంత్రం, సుందరే కిం న సుందరమ్? ॥

రాముడు సుందరుడు, సీతామాత భువనైక సుందరి, హనుమంతుడు పరమ సుందరుడు, శ్రీ సీతారాముల మహా మంత్రాలు దివ్యములు, ఈ సుందర కాండ కావ్యం అతి సుందరము, సుందరం కానిది ఏది? సర్వమూ సుందరమే.

హనుమంతుడు జితేంద్రియుడు ప్రజ్ఞావంతుడు, సీతాన్వేషణ అతని ఏకైక లక్ష్యము. ఎంత వెతికినా సీత జాడ తెలియలేదు. అప్పుడు

గుర్తుకి వచ్చింది. తన ప్రభువైన రాముని ప్రార్థించలేదని. అప్పుడు హనుమంతుడు,

నమోஉస్తు రామాయ సలక్ష్మణాయ,
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై
నమోஉస్తు రుద్రేంద్రయమానిలేభ్యో ।
నమోஉస్తు చంద్రార్క మరుద్గణేభ్య : ॥

అని శరణాగతి చెందినంతనే అశోకవనంలో సీతను చూశాడు. అక్కడ రామోదంతాన్ని వివరించి సీతామాతకు తను రాముని బంటుని అని నమ్మకం కలిగించాడు. రాముని అంగుళీయకాన్ని ఆమెకు సమర్పించాడు. ఆ తరువాత అశోక వనం ధ్వంసం కావించి, రావణ సేనలను పరిమార్చి, రావణునికి హితబోధ చేసి, రాక్షసులు తన తోకకు నిప్పు అంటించగా, లంకా దహనం చేసి, సీతమ్మను దర్శించి, రాముని చేరి, సీతాదేవి క్షేమవార్తను తెలిపి, రామునికి ఆనవాలుగా ఇచ్చిన చూడామణిని ఇచ్చి రాముని మన్ననలకు పాత్రుడైనాడు. రాముడు హనుమంతుని తన హృదయానికి హత్తుకొన్నాడు.శ్రీ రామ చంద్రుని ఆలింగన భాగ్యం పొందిన హనుమంతుడు ఎంత ధన్యాత్ముడో చెప్పలేము.

యుద్ధకాండలో ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రంతో మూర్ఛితుడైన జాంబవంతుని వద్దకు విభీషణుడు రాగా కొన ఊపిరితో ఉన్న జాంబవంతుడు అడిగిన మొదటి ప్రశ్న, "హనుమంతుడు క్షేమమా? హనుమంతుడు క్షేమంగా ఉంటే మనం లేకున్నా పరవాలేదు. హనుమంతుడు లేకుంటే మనం ఉన్నా, లేనట్లే." అని.

ఆఖరిగా హనుమంతుడు తనని రామ భక్తునిగా ఆశీర్వదించమని అడుగగా, శ్రీరాములవారు,"ఈ రామకథ ఈ మహీతలంలో చెప్పబడునంత కాలం నిస్సంశయంగా నీ కీర్తి చిరకాలం ఉంటుంది" అని దీవించాడు.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

కొన్ని కొన్ని ఉత్తమ సంస్కారములు, కొంతకాలం వ్యక్తులలో గుప్తముగా ఉండి, సద్గురు కృపను అందుకొన్నప్పుడు, ఒక్కసారిగా బహిర్గతమై ప్రకాశిస్తాయి. అలాగే అంతవరకు తమ కుల, ధన, పదవీ ప్రాబల్యములతో ప్రభావితమైన తాతయ్యగారి జీవితము, శ్రీ బాబు సమాశ్రయం పొందిన తరువాత పూర్ణంగా పరివర్తనం పొంది, నిరాడంబరము, పారమార్థికము, సహన, సౌశీల్య, సాధులక్షణ లక్షితము అయిన పవిత్ర జీవితంగా రూపుదిద్దుకొన్నది. తాతయ్యగారు త్రికరణ శుద్ధిగా శ్రీ బాబును, తమ జీవిత నౌకను ఒడ్డుకు చేర్చగల సద్గురు దేవునిగా నిర్ణయించుకుని, సకుటుంబంగా అచంచల విశ్వాసంతో శ్రీగురు చరణాలను సమాశ్రయించారు. ఇక వారందరికి శ్రీబాబు మాట వేదవాక్కు. శ్రీ బాబు సేవయే ఏకైక సాధన. శ్రీబాబు మాత్రం వారింట్లో అతి చనువుగా స్వతంత్రంగా తాతయ్యగారి కుమారులలో పెద్ద కుమారునిగా, మనుమలలో పెద్ద మనుమడుగా, సఖులలో ప్రియతమ సఖుడుగా కలిసిపోయే వారు.



తాతయ్యగారింట్లో అప్పట్లో వల్లమాలిన ఆచారమూ, మడీ వుండేవి. “మడీ ఆచారం అనేవి పరిశుభ్రత కోసము, చేసే పనిలో భక్తి శ్రద్ధలు పెంచటం కోసమేగాని, ‘అంటకు, ముట్టకు’ అని అందరిని ‘అసింట’ ఉంచటానికి, కాకిలాగా మాటిమాటికి తల స్నానాలు చేసి తడి బట్టలతోనో ‘చీకటి మడి’తోనో వంటలు, వడ్డనలు, పూజలు చేయటానికి కాదు ” అని శ్రీబాబు చెప్పేవారు. మడికి, ఆచారానికి అర్థమూ, పరమార్థమూ ఏమిటో, అది ఎప్పుడు సార్థకమవుతుందో వారికి తెలియ జెప్పాలని శ్రీబాబు నిర్ణయించుకున్నారు.

సదాచార సంపన్నులమనుకొనే వారు, యితరుల కెవరికైనా భోజనం పెడితే వారు భోజనం చేసిన చోట పసుపు నీళ్ళతో గాని, గోమయం కలిపిన నీటితో గాని శుద్ధి పెడతారు. లేదా పెట్టిస్తారు. శ్రీబాబును గురించి అవగాహన లేని వారు మొదట్లో అలా శ్రీబాబుతోనే శుద్ధి పెట్టించిన వారు చాలామందే ఉన్నారు.

ఒకసారి తాతయ్యగారింటికి వచ్చిన ఒక అతిథికి శ్రీబాబు, దగ్గర కూర్చొని భోజనం పెట్టించారు. తరువాత సీతమ్మగారు నీళ్ళలో పసుపు కలుపుకొని వచ్చి శుద్ధి పెట్టబోతుంటే, శ్రీబాబు ఆపి "నీళ్ళలో పసుపు ఎందుకు కలుపుతున్నావు?" అన్నారు. "శుద్ధి కోసం" అని సీతమ్మగారు చెప్పారు. "పసుపు, గోమయము ఎంత పవిత్రమైనవో నీళ్ళు కూడా అంత పవిత్రమే. నీరు నారాయణ స్వరూపము. సర్వభూతములు, ప్రాణములు, జీవరాసులు, అన్నము, అమృతము, విరాట్టు, వేదములు, సత్యము, సర్వదేవతలు, సర్వ లోకములు నీటి రూపములే. నీరు అన్నిటిని పవిత్రము చేయగలదు. పరమ శివుడే గంగను తన శిరస్సున ధరించాడు"అని బోధించారు. అలా నెమ్మదిగా తాతయ్యగారి కుటుంబ సభ్యులందరికీ శ్రీబాబు, నిజమైన 'మడి' ఏదో తెలియబరచి ఒప్పించారు.

ఒకరోజు తాతయ్యగారింట్లో ఆబ్దికం. అది చలి కాలం. తెల్లవారుఝామున మూడు గంటలకే లేచి సీతమ్మగారు చన్నీళ్ళ స్నానం చేసి, తడి గుడ్డ చుట్టుకొని దానితోనే మరొక చీరను తడిపి ఆరవేసుకొని, అది ఆరినదాకా ఆ తడిచీరతోనే వంటపనులు చూస్తున్నారు. కట్టె పుల్లలతోనే వంట చేయాలి. కట్టె పుల్లలు పచ్చివి. మంట చేయాలంటే ఊదాలి. కళ్ళ నిండా పొగ. తడి చీర నుంచి నీళ్ళబొట్లు పడి మంట మళ్ళీ ఆరటం; ఇదీ అవస్థ. అలాగే అవస్థ పడుతూ సీతమ్మగారు వంట చేస్తున్నారు. కూరలోకి పోపు వేయిస్తూ, అది ఎక్కడ మాడిపోతుందో అని శ్రద్ధగా గమనిస్తుండగా, తల మీద ఎవరో చెయ్యి పెట్టారు. "ఎవర్రా ముట్టుకున్నారు?" అని కేక పెడుతూ సీతమ్మగారు వెనక్కి చూసేసరికి శ్రీ బాబు.

- సశేషం

విష్ణు  కథలు

-గత సంచిక తరువాయి

# మీరాబాయి

- రమణ ప్రసాద్

మై గిరధర్ కే ఘర్ జావూ౹ గిరిధర్ మ్హారో సాచీ ప్రీతమ్, దేఖత్ రూప్ లుభావూ ॥ రైన్ పడై తబహీ ఉఠ్ జావూ, భోర్ భయే ఉఠి ఆవూ ।రైన్ దినా వాకే సంగ్ ఖేలూ, జ్యూ జ్యూ తాహి రిఝావూ ॥ జో పెహరాదే సోయీ పహరూ, జో దే సోయీ ఖావూ । మీరీ ఉన్ కీ ప్రీత్ పురాణీ, ఉన్ బిన్ పల్ న రహావూ॥ జహా బైఠావే తిత్ హీ బైఠూ, బేచే తో బిక్ జావూ౹ మీరా కే ప్రభు గిరిధర్ నాగర్ బార్ బార్ బలి జావూ॥



"నేను నా గిరిధరుడి దగ్గరకు వెడుతున్నాను. గిరిధరుడే నా నిజమైన ప్రియుడు. పొద్దు గ్రుంకగానే లేచి వెళ్తాను. ప్రొద్దుటే లేచి వస్తాను. నా స్వామిని రాత్రింబవళ్ళు అలరిస్తాను. నాస్వామి ఏది ధరించమంటే అది ధరిస్తాను. ఏది తినమంటే అదే తింటాను. స్వామితో నా ప్రేమ అతి పురాతనమైనది. ఆయన లేక క్షణమైనా ఉండలేను. నాస్వామి ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చుంటాను. నన్ను ఎవరికైనా అమ్మేస్తే అమ్ముడుపోతాను. నేను నాస్వామికోసం ఏమైనా చేస్తాను! ఏమైనా చేస్తాను!

శ్రీకృష్ణుడు నడయాడిన బృందావనానికి మీరా వచ్చింది. అక్కడే గోపాలుడు గోవులను కాసినది. అక్కడే మురళీమోహనుడు యమునా తీరాన మురళీగానం చేసి గోపికలను సమ్మోహపరచినది.

మీరాకు ఇప్పుడు ఏ బంధాలు లేవు. ఏ ఆంక్షలూ లేవు. భక్తులతో సాధువులతో సంకీర్తన చేసేది. వారితో గోష్ఠి సలిపేది. తను వచ్చింది కృష్ణుణ్ణి దర్శించాలని కదా! ఎలా నిత్యం ఆయన దర్శన భాగ్యాన్ని పొందటం? ఆమెకు ఒక ఉపాయం తోచింది. కృష్ణుడిని తన పనిమనిషిగా పెట్టుకోమని ప్రార్థిస్తే... అప్పుడు తాను పనిచేస్తూనే కృష్ణుడు అటుగా వచ్చినప్పుడు అతడిని

చూడవచ్చు. మీరా కృష్ణునితో...

శ్యామ్! మనె చాకర్ రాఖోజీ।
గిరిధర్‌లాల్ చాకర్ రాఖో జీ॥
చాకర్ రహసూఀ బాగ్ లగాసూఀ నిత్ ఉఠి దరసన్ పాసూః
బృందావన్ కీ కుంజగలిన్ మే, తేరీ లీలా గాసూఀ ॥మనె॥
చాకరీమే దరసణ్ పావూఀ, సుమిరణ్ పావూఀఖరచీ ।
భావ్ భకతి జాగీరీ పావూఀ,తీనోబాతా సరసీ ॥ ॥మనె॥
మోర్ మకుట్ పీతాంబర్ సోహై, గల్ బైజంతీమాలా ।
బృందావన్ మే ధేను చరావే, మోహన్‌మురళీవాలా ॥ ॥మనె॥
హరే హరే నిత్ బాగ్ లగావూఀ, బిచ్ బిచ్ రాఖూఀ క్యారీ ।
సావరియాకే దరసణ్ పావూ పహర్ కసుమ్మీ సారీ॥ ॥మనె॥
జోగీ ఆయా జోగ్ కరణకూ , తప్ కరనే సన్యాసీ ।
హరీ భజన్ కో సాధూ ఆయా, బృందావన్‌కే వాసీ ॥ ॥మనె॥
మీరా కే ప్రభు గహిర్ గంభీరా, సదారహో జీ ధీరా।
ఆధిరాత్ ప్రభు దరసణ్ దీన్హా, ప్రేమనదీకీ తీరా ॥ ॥మనె॥

"శ్యామ్! నన్ను నీ దగ్గర పనిలో పెట్టుకో. నీ దగ్గర పనిలో కుదిరి తోటపని చేస్తాను. అలా రోజూ నీ దర్శనభాగ్యం నాకు కలుగుతుంది. బృందావన వీధులలో నీ లీలలను వర్ణిస్తూ పాడుతాను. నీ దగ్గర చాకిరీ చేస్తూ రోజు నీ స్మరణ చేస్తాను. నెమలి పింఛము గల కిరీటం ధరించి, పీతాంబరధారియై బృందావనంలో ధేనువులను కాస్తున్న నా మురళీ మోహనుడిని చూస్తాను. రోజూ తోటలో చిన్నచిన్న మొక్కలను నాటుతాను. వాటికి అంట్లు కడతాను. నా శ్యామసుందరుని నిత్యం దర్శిస్తాను. ఇక్కడకు వచ్చే యోగులతో, సాధువులతో కలసి హరిభజనలు చేస్తాను. ఎప్పుడూ ధీరత్వంగా కృష్ణుని స్మరణలోనే ఉంటాను. నాస్వామి అర్ధరాత్రి నాకు ప్రేమనదీ తీరాన దర్శనం ఇస్తాడు. ఆ ప్రేమవాహినిలో మునకలు వేస్తూ ఆనందాన్ని పొందుతాను."

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL